వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శుక్రవారం 04 నవంబర్ 2022

రాయలసీమ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది

పులివెందుల రూరల్, నవంబరు 03, ప్రభాతవార్త : రాయలసీమ అభివృద్ధికి భారతీయ జనతాపార్టీ కృత నిశ్చయంతో పనిచేయడం జరుగుతుందని భారతీయ జనతాపార్టీ ఏపీ అధ్యక్షుడు సోము వీర్రాజు పేర్కొన్నారు. పులివెందులలోని ఆర్అండ్బీ అతిథి గృహంలో గురువారం బీజేపీ నాయకులతో కలిసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీలో పోలవరం నిర్మాణం, రూ.6వేల కోట్లతో మూడు ఎక్స్ప్రెస్ హైవే కారిడార్లు నిర్మాణం, కర్నూల్లో రైలుకోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి, అదే విధంగా రాయలసీమలో హైకోర్టు ఏర్పాటుకు, సీమలో పెండింగ్లో ఉన్న రైల్వే నిర్మాణ ప్రాజెక్టులకు అధిక మొత్తంలో నిధులు ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మూడు రాజధానులపై మాట మార్చడం సబబు కాదన్నారు. ఎన్నికలకు ముందు అమరావతిని రాజధానిగా ప్రకటిస్తూ అక్కడే శాశ్వత స్థిర నివాసం ఏర్పరచుకుని, ఇప్పుడు మాట మార్చడం ఏ మేరకు సబబు అని ముఖ్యమంత్రిని ప్రజలు ప్రశ్నించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి వంగల శశిభూషణ్రెడ్డి, భానుప్రకాష్, ఇతర నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కట్టుకున్నవాడే కడతేర్చాడు : అనాధలయిన పిల్లలు

రాయచోటి.నవంబర్ 03 ప్రభాతవార్త వేదమంత్రాలు సాక్షిగా వివాహమాడిన భర్త భార్యపై అనుమానం పెనుభూతంగా మారి అతికిరాతకంగా చంపిన ఘటన అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణం రెడ్డివారిపల్లెకు చెందిన రజనాల రాజేశ్వరి పై అనుమానంతో భర్త రామ్మోహన్ అతి కిరాతకంగా కత్తితో పొడిచి చంపినట్లు పోలీస్లు తెలిపారు. బతుకుతెరువు కోసం గల్ఫ్కు వెళ్లి వచ్చిన తన భర్త, భార్య మీద పలు రకాల అనుమానాలు పెంచుకున్న భర్త చంపినట్లు అర్బన్ సిఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తల్లిమరణించడం తండ్రి పరారీలో ఉండటంతో పిల్లలు అనాధలుగా మారడం గ్రామంలో పలువురు పిల్లలను చూసి కంటతడి పెట్టారు. నిందుతుడు పరారీలో ఉన్నట్లు త్వరలో పట్టుకుంటామని ఆయన తెలిపారు. ఈ విషయమై రాష్ట్ర మహిళా కమీషన్ సభ్యులు గజ్జల లక్ష్మీ ఈ సంఘటనపై అర్బన్ సిఐ సుధాకర్ రెడ్డితో చర్చించి నిందుతుడిని కఠినంగా శిక్షించాలని ఆమె బిడ్డలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆమె తెలిపారు.

డికేటి స్థలాలను రిజిష్ట్రేషన్ చేసిన అధికారులు

పట్టా స్థలం ముందు ఎంత డికేటీ ఉన్నా పట్టా - భారీగా ముడుపులు తీసుకొని రిజిష్ట్రేషన్లు

సెంటు రూ.2 లక్షలు ఉండేది రిజిష్ట్రేషన్తో రూ.10 లక్షలు - అక్రమార్కులకు అడ్డే లేదు

బద్వేలు, నవంబరు 03 ప్రభాతవార్త : పట్టా స్థలం ఉంటే ఎంత డికేటీ స్థలం ఉన్నా రిజిష్ట్రేషన్ చేసుకునే హక్కును బద్వేలులో అధికారులు కల్పిస్తున్నట్లు వార్తలు విన్పిస్తున్నాయి. రిజిష్ట్రేషన్ స్థలాలు, భూములు ఉన్న ప్రాంతాలలో ముందు భాగంలో కొద్దిగా డికేటీ ఉంటే భారీగా ముడుపులు తీసుకొని రిజిష్ట్రేషన్ చేస్తున్న వైనంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. గోపవరం మండలం మడకలవారిపల్లె పరిధిలోని వెలుగు పాఠశాల గోడ ఆనుకొని ఉన్న డికేటి స్థలాన్ని రిజిష్టర్ స్థలంగా మార్చివేసినట్లు సమాచారం. డికేటీ స్థలానికి ముందు ఉన్న సర్వే నెంబర్ 805 లో ఉన్న హక్కుదారులకు 36 సెంట్లు డికేటిని రిజిష్ట్రేషన్గా మార్చిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో ఆ స్థలాలకు భారీగా రేట్లు పెరిగాయి. నిన్నటి వరకూ ఆ ప్రాంతంలో డికేటి స్థలం విలువ సెంటు 2 లక్షల రూపాయలు ఉంటే నేడు రిజిష్ట్రేషన్ కావడంతో 10 లక్షల రూపాయలు పలుకుతోంది. ఇలా రిజిష్ట్రేషన్ స్థలాల ముందు డికేటీలు ఉంటే మామూళ్లు ఇచ్చి రిజిష్ట్రేషన్ చేయించుకునే హక్కును బద్వేలులో కల్పిస్తున్నట్లు తెలుస్తుంది. 805 సర్వే నెంబరులో నాలుగున్నర ఎకరా పైగా రిజిష్ట్రేషన్ ఉంటే వాటి ముందు భాగంలో వెలుగు పాఠశాల ఆనుకొని ఉన్న 7 డికేటీ పట్టాలను, వాటికి ఉన్న రోడ్లను మొత్తాన్ని నాలుగున్నర ఎకరా భూమిలోకి రిజిష్ట్రేషన్ చేసినట్లు తెలిసింది. అంతకు ముందే వాటిలో లే-అవుట్లు ఏర్పాటుచేయడం వలన వాటి విలువ అధికంగా పెరిగింది. డికేటీ స్థలాలను కూడా రిజిష్ట్రేషన్లోకి కలపడంతో మార్కెట్ విలువ పెరగడంతో రియల్టర్లకు మంచి లాభాలు వచ్చాయి. ఇంత లాభాలు వచ్చినపుడే అధికారులకు ఇచ్చే ముడుపులలో వారికి ఏమీ కాదనుకొనే ఈ వ్యవహారం నడిచిందని ఆలస్యంలో వెలుగులోకి వచ్చింది. దీనిని బట్టి చూస్తే నాగులచెరువు పరిధిలో కూడా ఇలాంటి సంఘటనే చోటుచేసుకుంది. కృష్ణ మందిరం పక్కన ఉన్న ఒకటిన్నర ఎకరా రిజిష్ట్రేషన్ ఉండగా వెనుక భాగంలో ఉన్న చెరువు స్థలాన్ని రిజిష్ట్రేషన్ చేసేందుకు ముమ్మర యత్నాలు చేసినట్లు సమాచారం. ఇప్పటికే రిజిష్ట్రేషన్ జరిగి ఉండవచ్చనే ఊహాగానాలు రేకెత్తుతున్నాయి. ఈ మధ్య కాలంలో పత్రికల్లో నాగుల చెరువు ఆక్రమణలపై వరుస కథనాలు వచ్చిన నేపథ్యంలో అధికారులు వెనక్కి తగ్గినట్లు కనపడుతుంది. నాగుల చెరువు చుట్టూ రిజిష్ట్రేషన్ స్థలాలు ఉన్నప్పటికీ ఆక్రమిస్తూ వస్తున్నారు. కొంత మంది రియల్టర్లు ఏకంగా రిజిష్ట్రేషన్ స్థలానికి ముందు చెరువు స్థలం ఉండడంతో రిజిష్ట్రేషన్ చేసినట్లు కూడా సమాచారం. దీనిపైన నీటి పారుదల శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. డికేటీ ఉంటే రిజిష్టర్ చేయించుకునే అధికారం ఉంటుందనే ధైర్యంతో రియల్టర్లు డికేటీ స్థలాల పక్కనే రిజిష్టర్లు ఉంటే వెంటనే కొనుగోలు చేస్తున్నారు. వీటి ధర లక్షల రూపాయలు ఉన్న స్థలాలు కోట్ల రూపాయలలో ధరలు పలకడం దీనికి ప్రధాన కారణం. అలాంటివి బద్వేలులో అనేక స్థలాలు కనపడుతాయి. కొన్ని మాత్రమే బయటికి రావడం జరుగుతుంది. ఏది ఏమైనా బద్వేలులో స్థలాల మార్కెట్ విలువ రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో డికేటీలపై కన్ను వేయడమే గాక డికేటీలను ఆనుకొని ఉన్న రిజిష్ట్రేషన్ స్థలాలపై ప్రత్యేక దృష్టిపెట్టి లబ్ధిపొందుతున్నట్లు సమాచారం.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ

రాయచోటి.నవంబర్ 03 ప్రభాతవార్త రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ కలెక్టర్ను ఆదేశించారు. గురువారం వెలగపూడి సచివాలయం నుంచి జగనన్న ఇళ్ల నిర్మాణం స్పందన, అనీమియా తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సమీర్ శర్మ మాట్లాడుతూ మహిళలు చిన్నారులు, రక్త హీనత, పోషకాహార లోపాలను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా మహిళలకు వైఎస్సార్ సంపూర్ణ పోషకాహారం మరియు పిల్లలకు జగనన్న గోరుముద్దలను అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందజేయడం జరుగుతోందన్నారు. ప్రభుత్వం అందించే ఈ పౌష్టికాహారాన్ని పిల్లలు తీసుకుంటున్నారా లేదా అనే అంశంపై సీడిపివోలు తగు పర్యవేక్షణ చేయాలన్నారు. కోడి గుడ్లు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయకపోతే సంబందిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే స్పందన అర్జీలను గడువులోగా పరిష్కరించాలన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే ఎందువల్ల పరిష్కరించలేక పోయారో అర్జీదారునికి అర్థమయ్యే విధంగా తెలియజేయాలన్నారు. జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణం పనులను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. ప్రతి పేదవాడికి ఇళ్లు నిర్మించాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జిల్లాలో అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో జరుగుతున్న కార్యక్రమాలు వంద శాతం పూర్తి చేసి జిల్లాకు మంచి పేరుతీసుకురావాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డిఆర్వో సత్యనారాయణ, హౌసింగ్ పిడి శివయ్య, ఐసిడిఎస్ పిడి నిర్మల, జిల్లా సర్వేయర్ జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరులో 200 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా

అక్రమంగా ఆన్లైన్ చేసిన రెవెన్యూ అధికారి - వాటర్షెడ్ ఏరియా భూములు కూడ ఆక్రమణ!!

ఎస్టిల భూములు దౌర్జన్యంగా ఆక్రమణ

భూ ఆక్రమాలు ఆగడంలేదు. కొందరు అవినీతి అధికారులు ఇష్టారాజ్యంగా ముడుపులు దండుకొని అక్రమార్కులకు ప్రభుత్వ భూములను కూడ అప్పనంగా అప్పగిస్తున్నారు. ప్రభుత్వ భూములు ఎలాంటి కేటాయింపులు అధికారికంగా లేకపోయినా అనధికారికంగా ముడుపులు తీసుకొని రెవెన్యూ రికార్డుల్లో ఎక్కిస్తున్నారు. అంతటితో ఆగకుండా వారి జాగీరు అన్నట్లు ప్లాట్లు వేసి అమ్ముకొంటున్నారు. ఈ చందా నందలూరు మండలం టంగుటూరు రెవెన్యూ గ్రామంలో బయట పడింది. 'వార్త'కు అందిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి.

రాజంపేట అర్బన్, నవంబరు 3 ప్రభాతవార్త టంగుటూరు రెవెన్యూ గ్రామంలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. మారుమూల గ్రామం కావడంతో ప్రభుత్వ భూములపై నేతల కన్ను పడలేదు. అయితే నందలూరు మండల నేతగా ఎన్నికైన సోమశిల ముంపు గ్రామాలకు చెందిన ఓ నాయకుడు నియోజకవర్గ నేత అండ చూసుకొని పెట్రేగిపోయాడు. వందలాది ఎకరాలు దండా చేశాడు. నందలూరు తహశిల్దారుగా పనిచేసి సర్వీసు నుంచి కొద్ది నెలల క్రితం తొలగింపబడిన ఓ అధికారి హయాంలోనే వంద ఎకరాలకు పైబడి ఈ ముంపుగ్రామాల నేత బినామి పేర్లతో రెవెన్యూ రికార్డుల్లో భూములు ఎక్కించుకొన్నట్లు సమాచారం. అంతేగాకుండా కడప జిల్లా కలెక్టర్ వీణాయిస్ హయాంలో 1995లో టంగుటూరు గ్రామ పరిసరాల్లో కేంద్ర ప్రభుత్వం వాటర్షెడ్లను మంజూరు చేసింది. సర్వే నంబరు 1041, 1171, 1172, 1183, 1204, 1207, 1208, 1210, 1213, 1223 సర్వేనంబర్లలో వాటర్ షెడ్ ప్రోగ్రామ్ను ప్రభుత్వం చేపట్టింది. ఈ వాటర్షెడ్ భూములను కూడ ముంపు గ్రామాల నేత కబ్జా చేసినట్లు తెలుస్తోంది. అంతేగాకుండా ఎరుకుల తెగ (ఎస్టి)కు చెందిన సామాజిక వర్గానికి చెందిన 15 ఎకరాల భూమి కూడ కబ్జా చేసినట్లు సమాచారం. టంగుటూరు భూ అక్రమాలపై ఇప్పటికే కలెక్టర్ గిరీషాకు ఫిర్యాదులు వెళ్లినట్లు తెలిసింది. ఈ భూ అక్రమాలపై నందలూరు తహశిల్దారు ఉదయ్ కుమార్ రాజుతో అన్నమయ్య జిల్లా కలెక్టర్ మాట్లాడినట్లు తెలిసింది. అలాగే కుందానెల్లూరుకు చెందిన మరో ఇద్దరు నేతలు కూడ సుమారు 80 ఎకరాలు ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు సమాచారం. ప్రభుత్వ భూముల కబ్జాలపై కొరడా ఝుళిపిస్తున్న కలెక్టర్ టంగుటూరు భూముల కబ్జాపై ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

నందలూరు భూకబ్జా వ్యవహారంలో ముగ్గురిపై క్రిమినల్ కేసులు

కలెక్టర్ ఆదేశాలతో తహశిల్దారు పోలీసులకు ఫిర్యాదు : ముగ్గురిపై కేసు నమోదు

మండల కేంద్రమైన నందలూరులో సర్వేనంబరు 1160/ఎ4లో 3.60 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమించిన వ్యవహారంలో జిల్లా కలెక్టర్ కబ్జాదారులపై కొరడా ఝుళిపించారు. 'వార్త' దినపత్రికలో గతనెల 27న 'నందలూరులో 10 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా' శీర్షికన వెలువడిన వార్త కథనంపై స్పందించి విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ భూకబ్జా వ్యవహారంలో నందలూరు-2 విఆర్ఓ వెంగయ్య సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. అనంతరం భూకబ్జాకు పాల్పడిన వారిపై విచారించి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా నందలూరు తహశిల్దారు ఉదయ్కుమార్రాజును ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నందలూరు భూకబ్జాకు పాల్పడిన ముగ్గురిని గుర్తించి నందలూరు పోలీసుస్టేషన్లో తహశిల్దారు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నందలూరు పోలీసులు సోమవిశెట్టి ప్రభాకర్, కాకి చంద్ర, నాగసుబ్బయ్యలపై ఆర్/డబ్ల్యు34 427, 447 ఐపిసి సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసు (క్రైమ్ నంబరు 165/2022) నమోదు చేశారు.

అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా జగనన్న పాలన

ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి టౌన్.నవంబర్ 03 ప్రభాతవార్త అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా ప్రజల సుఖ సంతోషాలే ధ్యేయంగా జగనన్న పాలన సాగుతోందని అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. గురువారం రాయచోటి మున్సిపాలిటి పరిధిలోని 12, 09 వార్డులలో 7, 5 సచివాలయాల పరిధిలోని ఫయాజ్ బంగ్లా, ఆదిరెడ్డి మిషన్ స్ట్రీట్, ఆలిమాబాద్ స్ట్రీట్, కుమ్మరమిట్ట, నాజ్హాల్ స్ట్రీట్, పురానాచావెల్ వీధులలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ వీధులలోని ప్రతి ఇంటి గడపకు శ్రీకాంత్ రెడ్డి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలపై ఆరాదీస్తూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందడం లేదని ఆయన దృష్టికి తీసుకొచ్చిన వారికి అధికారుల ద్వారా పరిష్కార మార్గాన్ని సూచిస్తున్నారు. అన్ని వీధులలో అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఆసరా, చేమూత, తదితర పథకాలు అన్ని ఇళ్లకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడుతుందని ఆశతో పైసా పైసా కూడబెట్టి అగ్రిగోల్డ్ సంస్థలో డిపాజిట్ చేశామని ఎంతో మందిని నమ్మించి అగ్రిగోల్డ్ బోర్డు తిప్పేయడంతో డిపాజిట్దారులకు అంతులేని క్షోభ మిగిల్చిందని అటువంటి పరిస్థితులలో అగ్రిగోల్డ్ బాధితులకు జగనన్న ప్రభుత్వం అండగా నిలిచిందంటూ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్చైర్మన్లు ఫయాజ్ బాష, ఫయాజుర్రెహమాన్, మురికినాటి వెంకట్రామిరెడ్డి, బేపారిమహమ్మద్ ఖాన్, కొలిమిచాన్బాష, ఫయాజ్అహ్మద్, జానం రవీంద్ర యాదవ్, పల్లారమేష్, అన్నా సలీం, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్

వైద్య ఆరోగ్యశాఖామంత్రి విడదల రజని

వైద్య ఆరోగ్య రంగాన్ని మరింత పటిష్టం చేస్తున్నాం : రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు

ప్రణాళికా బద్ధంగా పి.హెచ్.సిలను అభివృద్ధి చేసాం : కలెక్టర్ విజయ్ రామరాజు

కడప, నవంబర్ 3 ప్రభాతవార్త : వైద్య ఆరోగ్య రంగాన్ని మరింత పటిష్టం చేస్తున్నామని.. రాష్ట్ర ముఖ్యమంత్రి మరో అడుగు ముందుకేసి.. దేశం గర్వించదగ్గ బృహత్తర కార్యక్రమంగా.. "ఫ్యామిలీ ఫిజీషియన్" కాన్సెప్ట్ కు శ్రీకారం చుట్టారని.. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖామంత్రి విడదల రజని పేర్కొన్నారు. గురువారం వైఎస్ఆర్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ వైద్యకళాశాల సమావేశ మందిరంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం టి.కృష్ణబాబు అధ్యక్షతన.. వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి ఆరు జిల్లాల అధికారులతో ప్రాంతీయ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమీక్షా సమావేశానికి ముఖ్య అతిధిగా.. రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజని హాజరవ్వగా.. వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రెటరీ జి.ఎస్.నవీన్ కుమార్, కమీషనర్, ఎన్ హెచ్ ఎం ఎండి జె.నివాస్, వైఎస్ ఆర్ ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో హరేందిర ప్రసాద్, ఏపీఎంఎస్ఐడిసి ఛైర్మన్ భూమిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఏపీఎంఎస్ ఐడిసి ఎండి దిముర్రళీధర్ రెడ్డి, కలెక్టర్ వి.విజయ్ రామరాజు, రాయచోటి ఎమ్మెల్యే జి.శ్రీకాంత్ రెడ్డి, డిఎంఈ డైరెక్టర్ డా.రామిరెడ్డి, కమలాపురం, రాయచోటి ఎమ్మెల్యేలు పి.రవీంద్రనాథ్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు.. స్థానికంగానే వైద్య పరీక్షలు, మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో.. ప్రవేశ పెట్టిన "ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్" దేశం యావత్తు గర్వించదగ్గ బృహత్తర కార్యక్రమం అన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్సీ), 104 అంబులెన్స్ ద్వారా వైద్య సేవలు అందుతున్నాయి. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ లద్వారా కూడా రాష్ట్ర ప్రజలకు వైద్య సేవలు విస్తృతంగా, సంతృప్త స్థాయిలో అందుతున్నాయన్నారు. తాజాగా ప్రభుత్వం ఇప్పటికే "ఫ్యామిలీ ఫిజీషియన్" ట్రైల్ రన్ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిందన్నారు. ఈ ప్రక్రియను ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వైద్యాధికారులు, సంబందిత సిబ్బంది ప్రణాళికాబద్ధంగా, భాధ్యతాయుతంగా చేపట్టి.. ప్రజారోగ్య పతిష్టతకు పాటుపడాలన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం.టి. కృష్ణబాబు మాట్లాడుతూ.. ఏ ఒక్క నిరుపేద ప్రాణానికి... వైద్యం కొరత రాకూడదన్న సహృద్భావంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. వైద్య ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పటికే డా. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం పూర్తి ఉచితంగా అందిస్తున్నారన్నారు. మరో అడుగు ముందుకేసి.. గ్రామీణ స్థాయిలోనే, వారి ఇంటి వద్దనే.. ఎవరికి అవసరమైన వైద్యసేవలను.. అందించే సదుద్దేశ్యంతో "ఫ్యామిలీ ఫిజీషియన్" కాన్సెప్ట్ అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. అందుకు అనుగుణంగా మండల, గ్రామ స్థాయిలో వైద్య అధికారులు, సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా.. గతం కంటే ప్రస్తుతం అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో నాణ్యమైన మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయనే భావనను ప్రజలు సంతప్తిగా వ్యక్తం చేసేలా మార్పును తీసుకురావాలని తెలిపారు. జిల్లాల వారీగా వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ లు, పి.హెచ్.సి.లు, సి.హెచ్.సి.లలో.. ఎన్ని పోస్టులు భర్తీ

అయ్యాయి, ఎన్ని పోస్టులు ఖాళీలు ఉన్నాయి.. అనే అంశంపై ఆయా జిల్లాల డీఎంహెచ్ఓ లతో సమీక్షించారు. కలెక్టర్ వి.విజయరామరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్యం అందించాలనే ప్రభుత్వ లక్ష్యం దిశగా.. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను.సమన్వయం చేసుకుంటూ ముందుకెళుతున్నామన్నారు. బద్వేలు, జమ్మలమడుగు, రాజంపేట, రాయచోటి పరిధిలో డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేస్తే.. ఆ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. అలాగే వైఎస్ఆర్ జిల్లాకు ట్రామా కేర్ యూనిట్ మంజూరు చేయాలని.. ప్రిన్సిపల్ సెక్రెటరీ, మంత్రికి తెలియజేసారు. రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా గతంలో కోవిడ్ సేవల విషయానికి వస్తే.. కోవిడ్ పేషంట్లకు మెరుగైన వైద్యం అందించడంలో.. వైద్యులు, వైద్య సిబ్బంది చేసిన సేవలు ప్రశంసనీయం అన్నారు.

ఎట్టకేలకు అన్నమయ్య, పింఛా ప్రాజెక్టులకు మోక్షం

872 కోట్లతో పునర్నిర్మాణానికి పరిపాలన ఉత్తర్వులు

జలవనరులశాఖ జిఒలు జారీ



గత యేడాది వరదల్లో కొట్టుకుపోయిన పింఛా ప్రాజెక్టు మట్టికట్ట, కాంక్రీట్డ్యామ్ నిర్మించనున్న అన్న ప్రాజెక్టు కొట్టుకుపోయిన ఎర్త్డ్యాం ప్రాంతం ఇదే

రాజంపేట అర్బన్, నవంబరు 3 ప్రభాతవార్త గత యేడాది నవంబరులో వరదల్లో కొట్టుకుపోయిన అన్నమయ్య, పింఛా ప్రాజెక్టుల పునర్నిర్మాణానికి యేడాది తర్వాత ప్రభుత్వం పరిపాలనపరమైన అనుమతులు ఇస్తూ జిఒలు జారీ చేశారి ఈ మేరకు 2 ప్రాజెక్టుల పనులు చేపట్టేందుకు మార్గం సుగుమమైంది. రాష్ట్ర జలవనరులశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శశిభూషన్కుమార్ అన్నమయ్య ప్రాజెక్టుకు జిఒ ఆర్సి 2076, పింఛా ప్రాజెక్టుకు జిఒ ఆర్సి నంబరు 2075ను విడుదల చేసి పరిపాలనపరమైన ఆమోద ఉత్తర్వులు గురువారం జిల్లా జలవనరులశాఖకు చేరాయి. అన్నమయ్య ప్రాజెక్టు 787.77 కోట్ల వ్యయంతో ప్రాజెక్టు పునర్నిర్మాణానికి పరిపాలనపరమైన అనుమతి లభించింది. ఈ నిధుల నుంచే సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డిపిఆర్) సిద్ధం చేసేందుకు నిధులను కేటాయించింది. ప్రస్తుతం ఉన్న 5 ప్రాజెక్టులకు తోడు అధనంగా 11 గేట్లను ఏర్పాటు చేయనున్నారు. ప్రాజెక్టు మట్టికట్ట(ఎర్త్డ్యామ్) కాంక్రీట్ డ్యామ్ను నిర్మించనున్నారు. ఈ మేరకు జలవనరులశాఖ సిడిఒ చీఫ్ ఇంజనీర్ నుంచి ప్రాజెక్టు డిజైన్లను తీసుకోవాలని జిఒలో పేర్కొన్నారు. ఇకపోతే సుండుపల్లె మండలంలోని పింఛా ప్రాజెక్టు కుడి ప్రధానకాలువ నిర్మాణంతో పాటు హెడ్వర్కు, రింగ్బండ్ను నిర్మించేందుకు 84.33 కోట్ల అంచనా వ్యయంతో పరిపాలనపరమైన ఉత్తర్వులు జారీ అయ్యాయి. పింఛా ప్రాజెక్టు డిపిఆర్ను సిద్ధం చేసేందుకు 20 లక్షల రూపాయల నిధులు కేటాయించారు. ప్రస్తుతం 146 మీటర్ల పొడవు ఉన్న ఎర్త్డ్యామ్ను, రింగ్బండ్ను, పూర్తి కాంక్రీట్వాల్స్ను నిర్మించనున్నారు. ప్రస్తుతం పింఛా ప్రాజెక్టు అలుగు 30 మీటర్ల పొడవు ఉంది. దానిని 290 మీటర్లు పెంచుతూ సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్(సిడిఒ) చీఫ్ ఇంజనీర్ సిఫారసు చేశారు. దీనివల్ల వరద ఎక్కువ వచ్చినా పొడవైన అలుగు నిర్మాణం వల్ల రింగ్బండ్పై ఒత్తిడి లేకుండా పోతుంది. అలాగే కొట్టుకుపోయిన 350 మీటర్ల మెయిన్ కెనాల్ను పునర్నిర్మిస్తారు. రాజంపేట నియోజకవర్గంలోని అన్నమయ్య, పింఛా 2 ప్రాజెక్టులకు మట్టికట్టల స్థానంలో కాంక్రీట్డ్యామ్లు నిర్మించనున్నారు. ప్రభుత్వం పరిపాలనపరమైన అనుమతులు మంజూరు చేసిన నేపథ్యంలో జలవనరులశాఖ ఈ 2 ప్రాజెక్టుల పనులకు సమగ్ర నివేదిక రూపొందించేందుకు త్వరలో డిపిఆర్లు సిద్ధం చేసేందుకు టెండర్లను ఆహ్వానించనుంది. డిపిఆర్ టెండర్లు ముగిసిన తర్వాత టెండర్లను దక్కించుకొనే సంస్థలు సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేసిన తర్వాత పూర్తి స్థాయిలో ప్రాజెక్టుల పునర్నిర్మాణానికి టెండర్లు పిలవాల్సి ఉంటుంది. కనీసం 2 ప్రాజెక్టుల పునర్నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్సిగ్నల్ ఇవ్వడం ఆయా ప్రాజెక్టుల రైతాంగంలో హర్షం వ్యక్తమవుతోంది.

ప్రజలకు ఉత్తమ సేవలుఅందించాలి: ఎస్పీ

పెద్దతిప్పసముద్రం, నవంబర్ 3 ప్రభాతవార్త: తంబళ్ళపల్లె నియోజకవర్గంలోని మండల కేంద్రమైన పిటిఎం పోలీస్స్టేషన్ను ఎస్పి హర్షవర్ధన్రాజు ఆకస్మికంగా తనిఖీ సందర్శించారు. ఈ తనిఖీల్లో పెండింగ్లోని కేసులు, పలురికార్డులను పరిశీలించారు. వీటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా ఎస్ఐ మధురామచంద్రడు పోలీస్ సిబ్బందికి పలు రకాల సూచనలు సలహాలు ఇచ్చారు. మసీదుల్లో, దేవాల

నిరుద్యోగ సమస్య పరిష్కారానికి దేశవ్యాప్త ఉద్యమం

కడప ఏడురోడ్లు, నవంబరు 3, ప్రభాతవార్త:

42వ డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డీవైఎఫ్ఐ కార్యాలయంలో గురువారం కేక్ కట్ చేసిన డీవైఎఫ్ఐ మాజీ జిల్లా సహాయ కార్యదర్శి పి.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ చదువుకున్న నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పన కోసం దేశవ్యాప్త ఉద్యమానికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 1980లో లూథియానాలో నవంబరు 3వ తేదీన యువజనుల సమస్యలపై ఉపాధి కల్పన కోసం భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డీవై ఎఫ్ఐ అందరికీ విద్య అందరికీ ఉపాధి అనే లక్ష్యంతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్వతంత్ర్య పోరాట సమరయోధులు భగత్‌సింగ్‌రాజు గురుసుఖ దేవ్, చంద్రశేఖర్ ఆజాద్, అల్లూరి సీతారామరాజు వంటి అనేక మంది విప్లవకారుల స్ఫూర్తితో యువజన సమస్యల మీద నిరంతరం పోరాటం చేస్తున్న ఏకైక యువ జన సంఘం డీవైఎఫ్ఐ కొనియాడారు. రానున్న రోజుల్లో నరేంద్ర మోదీ ఎన్నికల వాగ్దానాల్లో ఇచ్చిన సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాల సాధన కోసం వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం విడబడిన ఏపీకి ప్రత్యేక హోదా రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ కడప ఉక్కు ఫ్యాక్టరీ కోసం డీవైఎఫ్ఐ పెద్దన్న పాత్ర పోషించి వీటి సాధనకు సమరశీల పోరాటాలు నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి డీఎం ఓబులేసు, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి కల్యాణ్, డీవైఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు విజయ్, నాయకులు వెంకటేష్, హేమంత్, దిలీప్ పాల్గొన్నారు.

అరెస్టును ఖండిస్తూ జ్యోతిరావుపూలే విగ్రహానికి వినతిపత్రం

కడప ఏడురోడ్లు, నవంబరు 3, ప్రభాతవార్త:

కడప నగరంలోని పాత బస్టాండు వద్ద ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి మాజీ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడు అరెస్టును ఖండిస్తూ ఆయన విగ్రహానికి తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.ఎస్.అమీర్‌బాబు, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, పార్లమెంటు ప్రధాన కార్యదర్శి వికాస హరి, తెదేపా నగర అధ్యక్షులు సానపురెడ్డి శివకొండారెడ్డిలు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ అయ్యన్న పాత్రుడు అక్రమ అరెస్టు వైసీపీ ప్రభుత్వ కక్ష సాధింపులో భాగమే అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జలతోటి జయకుమార్, ఆమూరి బాలదాసు, యాటగిరి రాంప్రసాద్, నాదెండ్ల దస్తగిరి మేకల వెంకటేష్ యాదవ్ ఎం.బుకారి, షేక్ ఇమ్రాన్, జింక శ్రీనివాసులు, కొండా సుబ్బయ్య, సుబ్బ రాయుడు, ఓబుల్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

డిమాండ్స్‌డే నిర్వహించిన ప్రభుత్వ పెన్షనర్లు

కడప ఏడురోడ్లు, నవంబరు 3, ప్రభాతవార్త:

పెన్షనర్ల న్యాయ సమ్మతమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అసోసియేషన్ భవన్ వద్ద డిమాండ్స్ డే నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుల చెన్నారెడ్డి, కార్యదర్శి రామమూర్తి నాయుడు మాట్లాడుతూ సీపీఎం విధానం రద్దు చేసి ఓపీఎస్ విధానంతో సర్వీస్ పెన్షన్, ఫ్యామిలీ పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. హెల్త్‌కార్డుల వల్ల పెన్షనర్లకు ఎటువంటి ఉపయోగం లేదని హెల్త్ ఇన్సూరెన్స్ అమలు పర్చాలన్నారు. 65 ఏళ్లు వయసు దాటిన పెన్షనర్లకు పెన్షన్ పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం డీఆర్ విడుదల చేసిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం డీఆర్ విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గుండె పోటుతో వైసీపీ కార్యకర్త మృతి

పెండ్లిమర్రి, నవంబరు 3, ప్రభాతవార్త:

మండలంలోని రేపల్లె గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త సుబ్బరాయుడు (50) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి సుబ్బరాయుడు మృతదేహానికి పూల మాల వేసి సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఈయన వెంట మాజీ సర్పంచి రఘునాథ్‌రెడ్డి, జిల్లా పరిషత్ వైస్‌ఛైర్మన్ బాలయ్యలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి భక్తులకు నిత్యాన్నదానం

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 3, ప్రభాతవార్త:

మండలంలోని నామాల గుట్టపైన నూతనంగా ఏర్పాటు చేస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయంలో ఈనెల 3వ తేదీ నుంచి జనవరి నెల 10వ తేదీ వరకు అయ్యప్ప స్వామి భక్తులకు నిత్య అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు గంగరాజు, వెంకటేష్, నాగేంద్ర, సుధీర్, గంగరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి గురువారం ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది కార్తీక మాసం మొదలుకొని అయ్యప్ప జ్యోతి దర్శనం వరకు అన్నదాన కార్యక్రమం చేయడం గొప్ప కార్యమన్నారు. అన్ని దానాల్లో కన్నా అన్నదానం మహా గొప్ప దానమన్నారు. అనంతరం మొదటి రోజున అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఉమాపతిరెడ్డి, వాసు, ఆంజనేయులు, గురుస్వాములు, నరసింహంరెడ్డి, పద్మేష్, గంగయ్య స్వామి, రమణ స్వామి, నరసింహారెడ్డి, రాయచోటి గురుస్వామి, సుబ్బయ్య, అయ్యప్ప స్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

తనపై వచ్చిన విమర్శలపై స్పందించిన ఎమ్మెల్యే

కమలాపురం, నవంబరు 3, ప్రభాతవార్త:

కమలాపురం వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తనపై మీడియాలో, సోషల్ మీడియాలో వచ్చిన విమర్శలపై ప్రెస్‌మీట్‌లో స్పందిస్తూ ప్రతి దానికి నా పేరు వెనకా ముందూ జగన్ బంధువునని ఆపాదించొద్దు. నాకు ఒక క్యాడర్, పదవి ఉంది. బాలకృష్ణ కాలితో కొడితే అభిమానం.. అదే పని నేను చనువుగా చేస్తే తప్పా అని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ప్రశ్నించారు. నియోజకవర్గంలోని వి.ఎన్.పల్లె మండ లంలో అలిదెన ఓబాయపల్లెలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్య క్రమంలో మాజీ సర్పంచ్ దేశాయిరెడ్డితో నాకు ఉన్న చనువుతో అలా అన్నా నని, దాన్ని మీడియా వక్రీకరించి చూపించిందన్నారు. కొన్ని పత్రికలు కరపత్రాలుగా తయారయ్యాయన్నారు. దేశాయిరెడ్డి మాట్లాడుతూ తనపై ఉన్న అభిమానంతోనే ఎమ్మెల్యే కోప్పడ్డారని తమకు ఎలాంటి విబేధాలు లేవన్నారు. తాము మొదటి నుంచి వైసీపీ కుటుంబానికి విధేయులమని, కానీ కొన్ని పత్రికలు, చానెళ్లు బూతద్దంలో చూపించాయన్నారు. తనను సంప్రదించి విషయం తెలుసుకొని ప్రచురించి, ప్రసారం చేసి ఉంటే బాగుండేదన్నారు.

8వ విడత భూ పంపిణీలో ఎస్సీ, ఎస్టీలకు అవకాశం కల్పించాలి

రామాపురం.నవంబర్ 03 ప్రభాతవార్త

8వ విడత భూ పంపిణీలో ఎస్సీ, ఎస్టీలకు అవకాశం కల్పించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిద్దిగాళ్ల శ్రీనివాసులు, మండల కార్యదర్శి చంద్రాయుడు, గరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అశోక్‌లు గురువారం తహశీల్దార్ సత్యానందముకు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే దళితులు సాగు చేసుకుంటున్న భూములు అన్‌లైన్‌లో మాత్రం అగ్రకులాల వారు ఉన్నారని పూర్తిగా విచారణ జరిపి ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, ఆంజనేయులు, చిన్నప్ప, విశ్వనాథ్‌లు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి వేడుకలు

దువ్వూరు, నవంబరు 3, ప్రభాతవార్త:

మండల పరిధిలోని చల్లబసాయపల్లె గ్రామంలో వెలసిన శ్రీ అభయాంజనేయస్వామి తృతీయ వార్షికోత్సవ వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. వేడుకల సందర్భంగా శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహానికి వివిధ రకాల పూలతో అలంకరించారు. పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళ హారతి, రుద్రాభిషేకం, పూర్ణాహుతి హోమం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. 2 రోజుల పాటు జరిగిన ఈ పూజల్లో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. బండలాగుడు పోటీల్లో 1 బహుమతి నంద్యాల జిల్లా బనగానపల్లె, కానాల గ్రానికి చెందిన గుండం చెన్నారెడ్డి ఎద్దులు రూ.40వేలు, 2వ స్థానాన్ని నంద్యాల మండలం భీమవరం గ్రామానికి చెందిన జి.కె.రెడ్డి ఎద్దుల రూ.30వేలు నిర్వాకులు అందజేశారు. 3వ స్థానాన్ని అనంతపురం జిల్లా ఎద్దుల రవీంద్రారెడ్డి ఎద్దులు, 4వ స్థానాన్ని ప్రకాశం జిల్లా, కాజీపురం గ్రామానికి చెందిన హుసేన్‌రెడ్డి ఎద్దులు, 5వ స్థానాన్ని కర్నూలు జిల్లా బోయ వెంకటేశ్వర్ల ఎద్దుల సాధించాయి. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఉత్సవాలకు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

పంట నమోదు జాబితా ప్రదర్శన

దువ్వూరు, నవంబరు 3, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరులోని 2వ రైతు భరోసా కేంద్రంలో గురువారం ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంట నమోదు వివరాలను మండల వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంట నమోదును ఆయా రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బంది ప్రదర్శిస్తారని రైతులు తమ పంట వివరాలు పరిశీలించుకోవచ్చన్నారు. ఎక్కడైనా తప్పులుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రస్తుతం పంట నమోదు చేసి ఈకేవైసీ చేయించుకున్న రైతుల వివరాలను ఈనెల 15వ తేదీన పంటల బీమాకు చెందిన యాప్‌లో నమోదు చేస్తామన్నారు. ప్రతి ఒక్క రైతు తమ పంట నమోదు అయ్యిందో లేదో తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చెంద్రాయుడు, వ్యవసాయ సహాయకులు రామచరణ్ పాల్గొన్నారు.

రాజంపేట పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెకటరీగా షబ్బీర్

వాల్మీకిపురం,నవంబర్ 3 :ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ ముస్లిం మైనార్టీ విభాగం ఆర్గనై జింగ్ సెకటరీగా వాల్మీకిపురం పట్టణానికి చెందిన సయ్యద్ షబ్బీర్ గురువారం రాజదాని మంగళగిరి పార్టీ కార్యాలయంలో ప్రమాణస్వీకారం చేశారు.టిడిపి జాతీయ పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆయన తన నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకు,జాతీయ పార్టీ ప్రదాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.కష్టించి పని చేసే వారికి తెలుగుదేశం పార్టీ మంచి స్థానం కల్పిస్తుందని పేర్కొన్నారు. వాల్మీకిపురం పట్టణ అధ్యక్షులు సయ్యద్ షఫీ,సయ్యద్ బషీర్, సయ్యద్ సిద్దిక్,కువైట్ బాబు,సయ్యద్ బాష, హనీఫ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు: ఎస్పి

బి.కొత్తకోట, నవంబర్ 3 ప్రభాతవార్త :

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, విజిబుల్ పోలీసింగ్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు పోలీసులపై నమ్మకాన్ని పెంచాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పోలీసులను ఆదేశించారు. ఆయన గురువారం బి.కొత్తకోట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, బి.కొత్తకోట పట్టణంలో ప్రధాన రహదారుల్లో సీసీ కెమెరాలు మరిన్ని ఏర్పాటు చేయాలని ఎస్ఐ రామ్మోహన్ ఆదేశించారు. ఆయన వెంట ఎస్‌బీ డీఎస్పీ రవి కుమార్, ములకల చెరువు సీఐ సాదిక్‌అలీ, డీసీఆర్‌బీ సీఐ రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

విశాఖా భూకబ్జాకు అడ్డువస్తున్నాడనే అయ్యన్న అక్రమ అరెస్టు

పెద్దమండ్యం నవంబర్ 3 ప్రభాతవార్త

విశాఖాలో భూకబ్జాలకు అడ్డు తగులు తున్నాడనే ఉద్దేశ్యంతో టిడిపి నాయకులు మాజి మంత్రి అయ్యన్న పాత్రుడిని అర్ధరాత్రి ఎలాంటినోటీసులు లేకుండాఅరెస్టు చేయడం రాజ్యాంగ వ్యవస్త ను బ్రస్టుపట్టిస్తున్న ముఖ్యమంత్రి జగన్ అసమర్ధ పాలనకు నిదర్శనమని మండల టిడిపి అధ్యక్షుడు వెంకటరమణ అన్నారు. గురువారం విలేకర్లతో మాట్లాడుతూ అంబేద్కార్ రాజ్యాంగాన్ని తుంగలో త్రొక్కి వైఎస్‌రాజా రెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్రాలో ఇప్పటికే 41వేలకోట్ల విలువైనఆస్తులను కబ్జాచేశారన్నారు. పెరుగుతున్న తెలుగు దేశం ప్రజా చైతన్యాన్ని ఓర్వలేక అక్రమకేసులు పెడుతున్నారని మండిపడ్డారు.

జాతీయ మహాసభను విజయవంతం చేయాలి

పీలేరు, నవంబరు 3 ప్రభాతవార్త

26-27 తేదీలలో రాజమండ్రిలో జరగనున్న బిల్డింగ్ వర్కర్సు, ఏఐటీయూసీ అనుబంధం జాతీయ మహాసభను విజయవంతం చేయాలని ఏపీ బిల్డింగ్ వర్కర్సు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీరాములు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ కోరారు. గురువారం పీలేరు పట్టణంలో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో వ్యవసాయం తరు వాత అతిపెద్ద రెండవ రంగం భవన నిర్మాణ రంగం, కార్మికులు సంక్షేమంగా ఉండాలని 1960లో కేంద్ర ప్రభుత్వం పార్ల మెంటులో చట్టం చేసిందని, నేటి పాలక ప్రభుత్వాలు చట్టాలను సక్రమంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నరసింహులు, కార్యదర్శి వేణు గోపాల్ రెడ్డి రమణ, వెంకటేష్ పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

కేవి.పల్లె, నవంబరు 3 ప్రభాతవార్త

మండలంలోని గ్యారంపల్లె పంచాయతీ రెడ్డివారిపల్లెలకు చెందిన జానకిరాముని సారా కేసులో అరెస్టు చేసినట్లు ఎస్సై లోకేష్ తెలిపారు. అందిన రహస్య సమాచారం మేరకు దాడులు నిర్వహించి జానకిరామ్ వద్ద 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని రిమాండుకు పంపినట్లు ఎస్సై తెలిపారు. దాడిలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీ కులాలకు ప్రమాదకరం

కేవి.పల్లె, నవంబరు 3 ప్రభాతవార్తః

వాల్మీకి, బోయకులాలను ఎస్టీ జాబితాలో చేర్చడం వలన ఎస్టీ జాతి అంత రించి పోతుందని రాష్ట్ర గిరిజన అధ్యక్షులు జీవి రమణ అన్నారు. ఎస్టీ జాతాలో పై కులాలను చేర్చే నిర్ణయాన్ని వ్యతిరేకస్తూ గురువారం ర్యాలీ నిర్వహించారు. తహశీల్దారు మహమ్మద్ అజారుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు రమణ, ప్రతాప్, ప్రమీళమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసమే ప్రభుత్వ పథకాలు : ఎమ్మెల్యే

మదనపల్లె, నవంబర్ 3 ప్రభాతవార్త :

ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. గురువారం పట్టణంలోని 19వ వార్డు సచివాలయం పరిధిలోని అప్పారావు తోట, పోతులప్ప వీధుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం మంజూరు చేస్తున్న నవరత్న పథకాల బుక్‌లెట్‌ను గడప గడపకు తీసుకెళ్ళి లబ్దిదారులకు అవగాహన కల్పించారు. వార్డులో నెలకొన్న ప్రజా సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకు నేందుకు అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదల సంక్షే మం కోసం అనేక పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి, కమీషనర్ ప్రమీళ, వైస్‌ఛైర్మెన్ జింకా వెంకటాచలపతి, కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అయ్యన్నపాత్రుడి అరెస్టు అక్రమం

మదనపల్లె, నవంబర్ 3 ప్రభాతవార్త :

ప్రశ్నించే వారిపై దాడులు, దౌర్జన్యాలకు దిగిడం, అయ్యన్నపాత్రుడి అరెస్టు అక్రమమని టిడిపి రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంక టేష్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రభుత్వం తీరుపై మండి పడ్డారు. అయ్యన్నపాత్రున్ని అర్ధరాత్రి సమయంలో ఆయన కుమారుడు రాజేష్‌ను అరెస్టు చేసిన తీరు వైకాపా పరాకాష్టానికి నిదర్శమన్నారు. రూరల్ మండ లం చిత్తూరు బైపాస్‌రోడ్డులో దివంగత రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి శ్రీక్రిష్ణదేవరాయ విగ్రహ స్థలాన్ని మార్పు చేయడం సబబు కాదన్నారు. సమావేశంలో విజయమ్మ, నవీన్‌చౌదరి, బుజ్జిలు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తాం : ఎంపిపి

మదనపల్లె, నవంబర్ 3 ప్రభాతవార్త :

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపిపి రెడ్డమ్మ వెలుగు చంద్ర అన్నారు. గురువారం మదనపల్లె రూరల్ మండలం దుబ్బిగానిపల్లె సచివాలయం నందు 104 వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం మారుమూల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇలాంటి వాహనాలను ప్రవేవపెట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిటిఎం పిహెచ్‌సి డాక్టర్ సునీత, ఎం.భారతి, సర్పంచ్ బుడ్డయ్య, ఆనందపార్థసారధి, వైసిపి నాయకులు చంద్రారెడ్డి, రమేష్‌బాబు, క్రిష్ణప్ప, సచివాలయ సిబ్బంది, 104పైలెట్ విశ్వనాత్‌రెడ్డిలు పాల్గొన్నారు.

పవన్ కళ్యాన్ జోలికొస్తే ఊరుకోం

మదనపల్లెక్రైం, నవంబర్ 3 ప్రభాతవార్త

పవన్‌కళ్యాణ్ జోలికొస్తే సహించేది లేదంటూ మైపోర్స్ మహేష్ హెచ్చరించారు. గురువారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ 11 రోజులుగా పవన్‌కళ్యాణ్ ఇళ్ళు, పార్టీ కార్యాలయం చుట్టూ కొందరు వ్యక్తులు అనుమానా స్పదంగా తిరుగుతూ, ఆయన వాహనాన్ని వెంబడిస్తూ పవన్‌ను నశితంగా పరిశీలిస్తున్నారు. ఈ ఘటనపై వీడియో తీసి పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం జోక్యం కల్పించుకొని భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశాడు. జరగరానిది ఏదైనా పవన్‌కళ్యాణ్‌కు జరిగితే ప్రతి జన సైనికుడు మానవబాంబులు కావడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఆమర నారాయణ, రామ్మూర్తి, ఆంజినేయులు, ప్రవీణ్ నాయుడు, సందీప్,శోభ, రూప, హర్ష, నరేష్ పాల్గొన్నారు.

స్పెషల్ డి.ఎడ్.ఇడి. బి.ఇడి, టీచర్స్ ట్రైనింగ్ కోర్సులలో ప్రవేశాలు

కడప ఎడ్యుకేషన్, నవంబర్ 3 ప్రభాతవార్త

హెలన్ కెల్లర్ కాలేజ్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్, కడప స్పెషల్ డి.ఎడ్.ఇడి. బి.ఇడి, టీచర్స్ ట్రైనింగ్ కోర్సులను నిర్వహిస్తున్నది. ఈ రెండు కోర్సులు కేంద్ర ప్రభుత్వ రీహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాచే అప్రూవల్ పొందినవి, ఇవి 2 సంవత్సరముల రెగ్యులర్ కోర్సులు. ఈ కోర్సు యోగి వేమన విశ్వవిద్యాలయంచే అఫిలియేషన్ పొందినది. ఈ రెండు కోర్సులు చేసినవారు చెవిటి-మూగ పిల్లల ప్రత్యేక పాఠశాలలు, ఇనుసివ్ స్కూల్స్ (సాధారణ పాఠశాలలు), రిసోర్సు టీచర్లు, భవిత కేంద్రాలలో రిసోర్సు టీచర్లు అగుటకు అర్హులు. కోర్సులో చేరుటకు ఇంటర్మీడియట్లో ఓసి, బిసి లకు 50% మార్కులు, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు 45% మార్కులు ఉండాలి. ఈ కోర్సులో చేరుటకు %ాజ, దీజ% లకు 50% మార్కులు 45% మార్కులు ఉండాలి. పై విద్యార్హతలు కలిగి పై కోర్సులలో చేరదలచినవారు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆర్‌సిఐ నిర్ణయించిన కోర్సు ఫీజు తీసుకొని హెలన్ కెల్లర్ కాలేజ్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్, రాజీవ్ గృహకల్పరోడ్డు, సెంట్రల్ జైలు దగ్గర, రామాంజనేయపురం, కడపకు నవంబర్ 10 లోగా రావలెను. ఇతర వివరాల కొరకు 9849311680, 9966006758 సెల్ నెంబర్లకు సంప్రదించవలెనని ఆ కళాశాల ప్రిన్సిపాల్ కం కరస్పాండెంట్ డాక్టర్ పి. దౌలత్ ఖాన్ తెలియజేశారు. నవంబర్ 10 న చివరి తేదీ అని తెలిపారు.

ఎంపి చొరచవతో రోడ్డుకు మహర్థశ

రామసముద్రం, నవంబర్ 3 ప్రభాతవార్త:

ఎంపి చొరవతో రోడ్డుకు మహర్థశ కలగనుంది. రామసముద్రం నుంచి మదనపల్లెకు పోయే మార్గంలో మూడు రోడ్లు కూడలి నుంచి చెంబుకూరుకు అరకిలో మీటర్ దూరం రోడ్డు గుంతలమయం కావడంతో మండల నాయకులు దీనిపై ఎంపి మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకళ్ళారు. దీనిపై స్పందించిన ఎంపి సంబంధిత ఆర్‌అండ్‌బి ఈఈ అరవిందదేవికి ఆదేశించారు. దీంతో ఈమె త్వరలోనే రోడ్డును పరిశీలించి అభివృద్ధి చేసేందుకు నివేధికలు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. ఈఈతో పాటు డిఈ గిరి, కన్సీనర్ భాస్కర్‌గౌడు, చెంబకూరు పంచాయితీ అభివృద్ధి అధ్యక్షులు జికెచంద్ర, కోఆప్షన్ మెంబర్ షమీర్, విజయరాజు, రాజేష్ పాల్గొన్నారు.

వెనుకబడిన ప్రాంతాల, మహిళల ఆర్థికాభివృద్ధికి కార్యాచరణ

కురబలకోట, నవంబర్ 3 ప్రభాతవార్త :

అన్నమయ్య జిల్లాలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం, మహిళల ఆర్థికాభివృద్ధి బాలికల విద్యకోసం కార్యాచరణ రూపొందిస్తున్నట్లు సెవన్ హిల్స్ చారిటబుల్‌ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ రవి కుమార్ తెలిపారు. గురువారం ఎంపి డిఓ కార్యాలయంలో అధికారులు ఎంపిడిఓ దిలీప్‌కుమార్, ఎంపిపి దస్తగిరితో ట్రస్టు నిర్వాహకులు సమావేశమై మాట్లాడారు. న్నమయ్య జిల్లాలో మారుమూల ప్రాంతాల్లోని అభివృద్ధి, ఎస్‌సి, ఎస్‌టిల అభ్యున్నతి, పిల్లల విద్యాభివృద్ధికి తమ సంస్థ ద్వారా అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని 13 పంచాయితీల్లోనూ పల్లెలు, జనాబా వివరాలను వారు సేకరించారు. డాక్టర్ రవీంద్ర, సోమశేఖర్ దీక్షితలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ బాలికల దినోత్సవం

పీలేరు నవంబరు 3 ప్రభాతవార్తః

మండలంలోని పీలేరు గ్రామ పంచాయతీ జిల్లా పరిషత్ మెయిన్ పాఠశాల నందు అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ స్వరూప మహిళా పోలీసులు మానస, కవిత, సీహెచ్

అయ్యన్నపాత్రుడు అరెస్టు పిరికి పంద చర్య
– టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి

తంబళ్లపల్లె, నవంబరు 3, ప్రభాతవార్త:

తెదేపా నాయకుడు అయ్యన్న పాత్రుడు అతని కుమారుడిని అర్ధరాత్రి అరెస్టు చేయడం ప్రభుత్వ పరికిపంద చర్యగా మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి విమర్శించారు. గురువారం మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ యాదవ్ ఆదేశాల మేరకు తంబళ్లపల్లె మండల కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్య కర్తలు, అయ్యన్నపాత్రుడు అరెస్టుపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ప్రజా పాలన పక్కన పెట్టి ప్రతిపక్షాలపై దాడులు, అరెస్టులతో అక్కసు వెళ్లగక్కడం, ఆనవాయితీగా మారిం దన్నారు. ప్రజలు వైకాపా పాలనపై విసిగిపోయారని రాబోయే రోజుల్లో తిరిగి తెదేపా జెండా రెపరెపలాడడం ఖాయమన్నారు. ఈ అవినీతి వైకాపా పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానా లను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వెంటనే అయ్యన్నపాత్రుడు అతని కుమారుడిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం చంద్రబాబునాయుడు, మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ నాయ కత్వా లు వర్ధిల్లాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు బేరీ శ్రీని వాసులు, బాలకృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ చలపతి నాయుడు, వెంకటరమణ, అడ్వకేట్ సిద్దారెడ్డి, మధుకర్, మ్యూజికల్ శివ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైకాపా ఉడత బెదిరింపులకు జనసేన బెదరదు

తంబళ్లపల్లె, నవంబరు 3, ప్రభాతవార్త:

విశాఖపట్నంలో జనసేన పార్టీ అధి నేత పవన్ కల్యాణ్ పర్యటించిన రోజు నుంచి అతని ఇంటి వద్ద రెక్కీ నిర్వహిం చడం పిరికి పంద చర్యగా మండల జన సైనికులు ఎద్దుల నరసింహులు, బండి మురళీకృష్ణ, నరేంద్రరెడ్డిలు అభివర్ణిం చారు. గురువారం క్రాస్ రోడ్డులో జనసేన నాయకులు నిరసన వ్యక్తం చేసి మా పార్టీ వారిపైనే కేసులు పెట్టడం వారి చేతకాని తనానికి నిదర్శనమన్నారు. వైకాపా ప్రభఉత్వం చేతనైతే ప్రజా సేవ చేయాలని కక్ష సాధింపు చర్యలు చేపడితే వెనక్కు తగ్గేది లేదని హెచ్చరించారు. కుల, మతాలకతీతంగా ప్రజా సేవ చేస్తున్న పవన్‌కల్యాణ్ అందరివాడుగా గుర్తింపు పొందాడని రాబోయే రోజుల్లో వైకాపా ప్రభుత్వానికి చరమ గీతం పాడడం ఖాయమని తెలిపారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు వెంటనే కేంద్ర ప్రభుత్వం అదనపు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కళ్యాణ్ నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. నిరసన కార్యక్రమంలో మండల నాయకులు మనోహర్, రాయుడు, జనసైనికులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలకు శ్రీకారం

తంబళ్లపల్లె, నవంబరు 3, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాల్లో సైతం బీఎస్ ఎన్ఎల్ 4జీ సేవలు అందించడానికి శ్రీకా రం చుడుతున్నట్లు బీఎస్ఎన్ఎల్ అధికా రులు సుధాకర్‌రెడ్డి, బాలాజీలు విలేకరు లకు తెలిపారు. గురువారం వారు మారుమూల గ్రామాలలో బీఎస్ ఎన్ఎల్ టవర్లు ఏర్పాటుకు స్థల సేకరణకు తహసీల్దారు కళావతిని సంప్రదించారు. తంబళ్లపల్లె మండలంలోని మర్రిమాకులపల్లి, కుక్కరాజుపల్లి, కోటకొండ పెద్ద మండెం మండలంలోని శివపురం, కురబలకోట మండలంలోని పిచ్చెలవాండ్ల పల్లిలో టవర్లు ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ స్థలం కేటాయించాలని అభ్యర్థిం చారు. ఈ విషయమై తహసీల్దారు స్పందించి వారు చెప్పిన ప్రదేశాల్లో ప్రభుత్వ భూమి ఉంటే గుర్తించి ప్రజలందరికీ బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు అందించడానికి సహకరిస్తామని తెలిపారు. అనంతరం బీఎస్ఎన్ఎల్ అధికారులు మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రతి ఒక్కరికి 4జీ సేవలు అందించడమే లక్ష్యంగా ఎంచుకున్నట్లు తెలిపారు. వారి వెంట ఆర్ఐ రవినాయక్, వీఆర్వోలు పాల్గొన్నారు.

సామాజిక సర్వేకి శ్రీకారం

తంబళ్లపల్లె, నవంబరు 3, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలంలో సామాజిక సర్వే నిర్వహణకు అధికారులు సమ యాత్తమవుతున్నారు. 2020-21 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులతో పాటు పలు శాఖల పనులను పరిశీలించడానికి సామాజిక సర్వే బృందం రానే వచ్చింది. ఈ విషయమై ఉపాధి హామీ సిబ్బంది తాము మండలంలో చేసిన ఉపాధి హామీ పనుల చిట్టాను ముం దు వేసుకొని విచారణకు సిద్ధ మవుతున్నారు. మొత్తం సామాజిక సర్వే బృందం రాక అనంతరం వీఎస్ఓల నియామకం అనంతరం ఉపాధి హామీసిబ్బంది ఇచ్చే నివేదికల ఆధారంగా మండలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయి లో పరిశీలిస్తారని ఏపీవో మాధవి విలేకరులకు తెలిపారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, ఐకేపీతో పాటు పలు శాఖలకు చెందిన సీసీ రోడ్లు, కచ్చా రోడ్లు, డ్రైనేజీ పనులతో పాటు చేసిన ప్రతి అభివృద్ధి పనులను నిష్పక్ష పా తంగా సామాజిక సర్వే చేసి ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధుల సమక్షంలో బహి రంగ సభలో నివేదికలు సమర్పిస్తామని అధికారులు తెలియజేశారు.

అవినీతి రహిత దేశం కోసం కృషి చేయాలి
– ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ

కడప క్రైం, నవంబరు 3, ప్రభాతవార్త:

అభివృద్ధి చెందిన, అవినీతి రహిత భారతదేశం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పిలుపునిచ్చారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా నగరంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ కార్యాలయంలో గురువారం అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ 'అభివృద్ధి చెందిన దేశం కోసం – అవినీతి రహిత భారతదేశం' అనే అంశంపైన ఇంజినీరింగ్ శాఖాధికారులతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ అభివృద్ధి పనులలో అవి నీతి అక్రమాలకు అవకాశం లేకుండా పాలనలో పారదర్శకత, గుడ్ గవర్నెన్స్, నాణ్య తా ప్రమాణాలతో చేపట్టి దేశ అభివృద్ధికి ప్రతి ఇంజినీరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ సర్కిల్ సూపరింటెండెంట్ జీవీ శ్రీనివాసులురెడ్డి, జిల్లా వాటర్ రీసోర్స్ అధికారి కృష్ణమూర్తి, అన్నమయ్య జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి సురేష్ కుమార్, విజిలెన్స్ అధికారులు లోకేశ్వర్‌రెడ్డి, డీఈఈ విజయ్ కిశోర్, ఏఈఈ అశోక్‌కుమార్, ఏవో కిరణ్ మోహన్‌రావు సిబ్బంది పాల్గొన్నారు.

అధికారం ఉందని అరెస్టులా?

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 3, ప్రభాతవార్త:

అధికారం ఉంది కదా అని టీడీపీ నాయకులను, కార్యకర్తలను అక్రమ అరెస్టులు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు శంకరపు జయరాం పేర్కొ న్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక్క చాన్స్ అని చెప్పి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చి టీడీపీ నాయకులపైన అక్రమ కేసులు బనాయించడం మంచిది కాదన్నారు. అచ్చన్నా యుడు స్థలం కోర్టులో ఉన్నా కావాలనే అర్ధరాత్రి అరెస్టులు దుర్మార్గమన్నారు. పరిపాలన చేతకాకపోయినా అక్రమ కేసులు, అరెస్టులు ఈ ప్రభుత్వానికి బాగా తెలుసన్నారు. మూడున్నర సంవత్సరంలో ఏమి సాధించారో ప్రజలకు చెప్పాలని వారన్నారు. 2024లో ప్రజలు వైసీపీకి బుద్ధి చెప్తారని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బడుగు వాసుదేవుడు, టీడీపీ నాయకులు సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపసుపులలో బాదుడే బాదుడు

జమ్మలమడుగు, నవంబరు 3, ప్రభాతవార్త:

పెద్దముడియం మండలం పెద్ద పసుపుల గ్రామంలో గురువారం జమ్మల మడుగు తెదేపా ఇన్‌ఛార్జి దేవగుడి భూపేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డిలు బాదుడే బాదుడు కార్య క్రమాన్ని నిర్వహించారు. ముందుగా వారు గంగమ్మ దేవాలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించి అనంతరం గ్రామంలోని యువకులు, మహిళలు నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ ఒక్క చాన్స్ అని చెప్పి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఎన్నో రకాలుగా ప్రజలను ఇబ్బం దులకు గురి చేయడమే కాకుండా మన జిల్లా వాసి సీఎం అయితే ఎంతో అభి వృద్ధి చెందుతుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందన్నారు. ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టడం, దౌర్జన్యం చేయడం పరిపాటిగా మారిందన్నారు. ఇచ్చే ఎన్నికల్లో తెదేపాని గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కొండా రెడ్డి, మల్లారెడ్డి, రాజేష్‌రెడ్డి, ఆగ్రో వెంకటేశ్వరరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, నాగరాజు యాదవ్, గురు, కండక్టర్ మల్లారెడ్డి, గురు యాదవ్, కులశేఖర్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, శేఖర్, ఈశ్వరయ్య, బాల చెన్నారెడ్డి, సాయి, పుల్లారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శామ్యూల్, సుందర్ రాజు, కిశోర్, మనోహర్, కిరణ్, జాషువా, తెదేపా నాయకులు, కార్యకర్తలు దేవగుడి అభిమానులు పాల్గొన్నారు.

బొందలకుంటలో పంట నమోదు

జమ్మలమడుగు, నవంబరు 3, ప్రభాతవార్త:

ముద్దనూరు మండలం బొందల కుంట రైతు భరోసా కేంద్రంలో గురు వారం తుది పంట నమోదు ముసాయిదా జాబితాను ప్రదర్శించే గ్రామ సభను గ్రామ సర్పంచ్ శ్రీమతి తాటి మునీశ్వరి అధ్యక్షతన మండల వ్యవసాయాధికారి మారెడ్డ, వెంకట కృష్ణారెడ్డి సమావేశం నిర్వహించారు. సభలో ఏడీఏవీ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ఖరీఫ్ 2022 సంబంధించి మార్కులు చేర్పులు అనంతరం తుది జాబితాను రైతుల సమక్షం లో పంట నమోదు జాబితాను ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు. ఈకే వైసీ చేసుకొని ప్రతి రైతు వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే ప్రతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దారు మాట్లాడుతూ పంట నమోదు జాబితాను ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. రైతులు జాబితాను పరిశీలించు కోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వీఆర్వో తేజస్విని గ్రామ ఉద్యాన సహాయకులు టి.ప్రశాంత్‌కుమార్, ప్రకీతి వ్యవసాయ సిబ్బంది మరియు గ్రామ నౌకరులు గ్రామ రైతు సోదరులు మహిళా రైతులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా న్యాయవిజ్ఞాన సదస్సులు

కడప లీగల్, నవంబరు 3, ప్రభాతవార్త:

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యూఢిల్లీ వారి ఆదేశానుసారం స్వాతం త్ర్యం సిద్ధించి 75 సంవత్సరాల సంద ర్భంగా గత నెల 31 నుంచి ఈనెల 13 వరకు పాన్ ఇండియా క్యాంపెయిన్ కార్య క్రమాలు నిర్వహించడం జరుగుతోందని సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జీ ఎస్.కవిత తెలిపారు. గురువారం ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరశీలన గృహం, పురు షులు కేంద్ర కారాగారం, ఆలంఖాన్‌పల్లె, అంగడివీధి, నాగరాజుపేట, ఆకులవీధి, పద్మావతి ఓల్డేజ్ హోం, ఉషోదయ స్కూలు, సచివా లయం, రైతు భరోసా సంద్యా సర్కిల్, చిన్నచౌకు, బాలాజీనగర్, మోచంపేట, ఎర్రముక్కపల్లె, శాస్త్రి నగర్, మాసాపేట, కుమ్మరవీధి, మోరగుడి, జమ్మల మడుగు ప్రాంతాల్లో 865 మందికి ఇంటింటి న్యాయ ప్రచారం మరియు 19 ప్రాంతాల్లో న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహించి చట్టాల పట్ల, జాతీయ న్యాయ సేవాధి కార సంస్థ పథకాల పట్ల అవగాహన కలిగించారు. కార్యక్రమం లో పారా లీగల్ వాలంటీర్లు, లా విద్యార్థులు, ఎన్‌జీవోలు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ ఉద్యోగులు, ప్యానెల్ న్యాయవాదులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతే లక్ష్యం
– ఏపీ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు నాగమల్లేష్

కడప కార్పొరేషన్, నవంబరు 3, ప్రభాతవార్త:

బీసీలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగుదలకు పాటు పడతా మని ఏపీ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు మచ్చయ్యగారి నాగమల్లేష్ పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని స్థానిక బీసీ రాష్ట్ర కార్యాలయంలో ఏపీ బీసీ ఐక్యవేదిక కడప జిల్లా నూతన కమిటీని ఎన్ను కున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గోచిమల్లయ్య యాదవ్, ఉపాధ్యక్షులుగా మచ్చయ్య గారి శివశంకర్, ప్రధాన కార్యదర్శిగా తప్పెట చంద్రశేఖర్, ట్రెజరర్‌గా యాదాటి శ్రావణ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు మచ్చయ్య గారి నాగమల్లేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.విజయ గోపాల్ మాట్లాడుతూ జిల్లా కమిటీని అభినందించారు. బీసీల సమస్యల పరిష్కారం కోసం పాటుడతా మన్నారు. బీసీలు విద్యా, ఆర్థికంగా అభివృద్ధికి కృషి చేస్తామని తెలి పారు. కార్య క్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎం.మల్లయ్య, పొలతల రజిక అన్నదాన సేవా సమితి ఉపాధ్యక్షుడు సి.మల్లేష్, మాల మహా నాడు ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, సలహాదారుడు చింతా వీరభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏపీఎన్ఆర్టీఎస్ సహకారంతో స్వస్థలం చేరిన అమీర్‌బాషా

కడప కార్పొరేషన్, నవంబరు 3, ప్రభాతవార్త:

గత 9ఏళ్ల నుంచి కువైట్‌లోని రెస్టా రెంట్‌లో పనిచేస్తున్న కడప నివాసి అమీర్ బాషా అనారోగ్యం కారణంగా ఇండియా కు రావడం జరిగిందని ఏపీ ఎన్ఆర్టీ ఎస్ డైరెక్టర్ ఇలియాస్ పేర్కొన్నారు. అమీర్ బాషాకు గుండెకు సంబం ధించిన శస్త్ర చికిత్సను వైద్యులు చేశారు. ఆరోగ్యం కుదుట పడ్డాక అమీర్‌బాషా తిరిగి కువైట్ వెళ్లారని తెలిపారు. ఆరోగ్యం సహక రించకపోవడంతో తిరిగి భారత్ కు వెళ్లిపోతానని ఆయన వేడుకున్నా కువైట్‌లో రెస్టారెంట్ మేనేజర్ అంగీకరించ లేదు. 500 దినార్లు రూ.1.50లక్షలు) చెల్లిస్తే తప్ప ఇండియాకు పంపించమని మేనేజరు తెగేసీ చెప్పారన్నారు. అమీర్‌బాషా స్నేహితుల ద్వారా కువైట్‌లో ఉన్న ఏపీ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ రీజనల్ కోఆర్డినేటర్ ఎంవీ నరసారెడ్డి సంప్రదించి ఇండియాకు వెళ్లడానికి సహకరిం చాలిందిగా అభ్యర్థించారు. అమీర్ బాషా ఆరోగ్య పరిస్థితి గమనించిన నరసారెడ్డి వెంటనే స్పందించి కువైట్ వైకాపా కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి సహకారంతో కువైట్‌లో భారత రాయభార అధికారులతో మాట్లాడి లేబర్ కోర్టు ద్వారా పది రోజుల్లో రెస్టారెంట్ వారితో మాట్లాడడం జరిగింది. అమీర్‌బాషాకు పాస్‌పోర్టు, టికెట్ పని చేసిన రోజులకు సొమ్ములు ఇప్పించడం జరిగిందని తెలిపారు. అమీర్ బాషా సురక్షితంగా గురువారం ఇండియాకు చేరుకున్నారు. అమీర్‌బాషా మాట్లా డుతూ మన భారత రాయభార కార్యా లయం, ఏపీఎన్ఆర్టీఎస్ వారు సమస్యను పరిష్కరించినందుకు నన్ను ఇండియా కు పంపినందుకు ధన్యవాదాలు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఏపీ ఎన్ఆర్టీఎస్ ఛైర్మన్ మేడపాటి వెంకట్, సీఈవో కె.దినేష్‌కుమార్, డైరెక్టర్ బీహెచ్ ఇలియాస్, కన్వీనర్ బాలిరెడ్డి, ఎంవీ నరసా రెడ్డి, మహేశ్వరరెడ్డి, మర్రి కల్యాణ్, సి.గుండాల్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

బెస్త కులాలకు కార్పొరేషన్ నిధులు ఏర్పాటు చేయాలి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 3, ప్రభాతవార్త:

బెస్త ఆఫ్ కులానికి సపరేట్‌గా కార్పొరేషన్ నిధులు ఏర్పాటు చేయాలని అన్నమయ్య జిల్లా టీడీపీ బెస్త సాధికార కమిటీ సభ్యులు దుర్గాప్రసాద్ పేర్కొ న్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లె మండలంలోని దిన్నెపాడు బెస్తపల్లెలో బెస్త కులాల సామాజిక సమావేశం నిర్వహించారు. ఈ సమాచారం మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం 45 సంవత్సరాలకు పింఛను ఇస్తామని గత ఎన్నికల ముందు చెప్పింది ఇప్పటి వరకు ఆ మాట ఎత్తున దాఖలాలు లేవన్నారు. బెస్త సంఘం నిధులు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి బెస్త కులాన్ని అభివృద్ధి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బెస్త సంఘం కుల నాయకులు పాల్గొన్నారు.

బ్యాంకు యాజమాన్యాలు కక్షపూరిత ధోరణి విడనాడాలి

ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 3, ప్రభాతవార్త

బ్యాంకు యాజమాన్యాలు కక్షపూరిత ధోరణి వీడాలని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య సెక్రటరీ గంగా సుధా కర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక గాంధీ రోడ్డు లోని యూనియన్ బ్యాంక్ వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ బ్యాంకు యాజమాన్యాలు అనుసరిస్తున్న నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య నవంబర్ 19 న దేశవ్యాప్త సమ్మెకు పిలుపు నిచ్చారని, బ్యాంకు యాజమాన్యాలు ఉద్యోగులపై అనుసరిస్తున్న కక్ష సాధింపు చర్యలు మానుకోని పక్షంలో దేశ వ్యాప్త సమ్మె తప్పదని తెలిపారు.

బీసీలపై దాడి అన్యాయం : మునిశేఖర్‌రెడ్డి

చాపాడు నవంబర్ 3, ప్రభాతవార్త

బీసీలపై దాడి అన్యాయమని తెలుగు దేశం పార్టీ కడప పార్లమెంటరీ అధికార ప్రతినిధి పి మునిశేఖర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సీని యర్ మాజీ మంత్రివర్యులు చింతకాయల అయ్యన్న పాత్రుడుని అరెస్టు అన్యాయమని. విశాఖలో అక్రమ ఆస్తులు కబ్జా చేస్తే అడ్డు వస్తాడని అందుకే ఆయనపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని అన్నారు. ఎన్టీ రామారావు హయాంలో బీసీ రిజర్వేషన్లు 34 శాతం ఉండగా వాటిని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం 10శాతం తగ్గించిందన్నారు. బీసీలపై దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు.

యూనివర్శిటీ బాల్‌బ్యాడ్మింటన్ టీం ఎంపికలు

ప్రొద్దుటూరు క్రైం, నవంబరు 3, ప్రభాతవార్త:

సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జేఎన్‌టీయూఏ పరిధిలోని కళాశాల విద్యార్థినీ, విద్యార్థులకు బాల్ బ్యాడ్మింటన్ టీం ఎంపికలను ట్రయల్స్ నిర్వహించారు. ఇంటర్ యూనివర్శిటీ సెలక్షన్స్‌కు ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూఏ సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ ఎ.బి.జోజిరెడ్డి, ఆర్‌జీఎం కళాశాల, నంద్యాల పీడీ చంద్రశేఖర్‌రెడ్డిలు హాజ రయ్యారని ప్రిన్సిపల్ డా.పాండురంగన్ రవి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ జేఎన్‌టీయూఏ పరిధిలోని వివిధ కళాశాలల నుంచి దాదాపు 140 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో ఛైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీర కల్యాణ్‌రెడ్డి, ఏవో జగదీశ్వర్‌రెడ్డి, పీడీ చరణ్‌రెడ్డిలతో పాటు ఆయా కళాశాలల పీడీలు పాల్గొన్నారు.

మహిళా విభాగంలో ఎంపికైన వారు : మనీషా, వెంకట శాంతిభాయ్, పూజిత, సాయిసంధ్య, శిరీష, తేజశ్రీ, లక్ష్మీప్రసన్న, దివ్య, అనిత, రూప ఎంపిక య్యారు. పురుషుల విభాగంలో ఉమర్ ఫరూక్, చైతన్య, పవన్, తిరుపతిబాబు నారాయణరెడ్డి, వెంకటసాయికృష్ణ, వెంకట దినేష్, మహేంద్ర, జమీర్‌బాషాలు ఎంపికయ్యారు.

1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఓఎంఆర్ ద్వారా పరీక్షల నిర్వహణ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 3, ప్రభాతవార్త:

నవంబరు 2వ తేదీ నుంచి జరుగుతున్న ఫార్మేటీవ్ పరీక్షలు-1 నుంచి 8 తరగతి వరకు ఓఎంఆర్ షీట్ ద్వారా పరీక్షలు నిర్వహించడం విద్యార్థి యొక్క సామర్థ్యాలను అంచనా వేయడానికి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్ష జిల్లా పథక అధికారి డా.అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఫార్మేటీవ్ పనరీక్షలను కడప డివిజన్ ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి, కడప మండల విద్యాశాఖాధికారి పాలెం నారాయణతో కలిసి పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ముందుగా పరీక్షలు జరుగుతున్న విధానాన్ని పాఠశాల ప్రధానో పాధ్యాయుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. నగరపాలక ఉర్దూ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు వస్తున్నదా లేదా అని అడిగి తెలుసుకోవడంతో పాటు గుడ్లు, చిక్కీలు సకాలంలో అందిస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్ రెడ్డి, కడప మండల విద్యాశాఖాధి కారి పాలెం నారాయణలు మాట్లాడుతూ రోజు ఉపాధ్యాయ, విద్యార్థుల హాజరు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు ఐఎంఎంఎస్ యాప్ ద్వారా విద్యార్థులకు అందిస్తున్న జగనన్న గోరుముద్ద నమోదు చేయాలని సూచించారు. పాఠశాలల్లో పరిశుభ్రతతో పాటు ఐఎంఎంఎస్ యాప్‌లో టాయిలెట్స్ నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్ఎం జావిదాఖానం, ఇన్‌ఛార్జి హెచ్ఎం శ్రీని వాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమంగా గ్రావెల్ తరలిస్తే క్రిమినల్ కేసులు : తహశీల్దార్

పెండ్లిమర్రి, నవంబరు 3, ప్రభాతవార్త:

మండలంలో ఎక్కడ పడితే అక్కడ గ్రావెల్ తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దారు ఉదయ్ భాస్కర్‌రాజు హెచ్చరించారు. ఈ సంద ర్భంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో గ్రావెల్ తరలించడం చట్ట రీత్యా నేరమని అందుకు కేసులు తప్పవని అనుమతులు ఉంటేనే గ్రావెల్ తరలించాలని ఆయన తెలిపారు. వీఆర్వోలు, వీఆర్ఏలకు అక్రమ గ్రావెల్ రవాణాపై ఎప్పటి కప్పుడు సమాచారం ఇవ్వాలని వారిని ఆదేశించారు. గ్రావెల్, ఇసుకను అక్రమం గా రవాణా చేస్తే వాహనాల డ్రైవర్లతో పాటు యజ మానులపై కేసులు తప్పవని యజమానులు ఈ అక్రమ రవాణాపై తగు జాగ్రత్తలు తీసుకొని వారి డ్రైవర్లను హెచ్చరించు కోవాలన్నారు. లేదంటే అందరూ కటకటాలపాలు కాక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పింఛనర్ల నిరసన..

జమ్మలమడుగు, నవంబరు 3, ప్రభాతవార్త:

జాతీయ పింఛనర్ల డిమాండ్ డే సందర్భంగా గురువారం జమ్మలమడుగు తాలూకా విశ్రాం త ఉద్యోగులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై గౌరవా ధ్యక్షుడు పొన్నారి దస్తగిరి నేతృ త్వంలో నిరసన కార్య క్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ పీఆర్‌సీ బకాయిలు, డీఆర్ బకాయిలు వవెంటనే చెల్లించాలని, జీపీఎస్ రద్దు చేయాలని, 65 సంవత్సరాలు, 70సంవత్సరాలకు 20శాతం అదనపు పింఛను ఇవ్వాలన్నారు. క్యాక్రమంలో అధ్యక్షులు దేవ దానం, సెక్రటరీ రామచంద్రారెడ్డి, జీసీ సుబ్బారెడ్డి, చిన్నయ్య, రామచంద్రుడు, సుబ్బారెడ్డి తదితర కార్యవర్గ సబ్యులతో పాటు పలువురు పెన్షనర్లు పాల్గొన్నారు.

అయ్యన్నపాత్రుడు అరెస్టు అక్రమం :

కమలాపురం, నవంబరు 3, ప్రభాతవార్త:

ఇన్‌ఛార్జి, తెదేపా సీనియర్ నా

మత్స్యకారులకు సబ్సిడీతో వలలు, కో రాకిల్ బుట్టలు

బద్వేలు, నవంబరు 03 ప్రభాతవార్త :

మత్స్యకారులకు ఏపిఐఐఏ టిపి పథకం క్రింద 60 శాతం సబ్సిడీతో వలలు, కో రాకిల్ బుట్టలు అందజేయనున్నట్లు మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు యం.వి.రమణ తెలిపారు. గురువారం హుస్సేన్ పీరా స్వామి దర్గా వద్ద మత్స్యకార సహకార సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యం.వి.రమణ మాట్లాడుతూ 2022-23 సంవత్సరానికి గాను ఏపిఐఐఏటిపి పథకం క్రింద 60 శాతం సబ్సిడీ ద్వారా వలలు, బుట్టలు ఇస్తున్నట్లు మత్స్యకార సహకార సంఘం తెలిపిందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క మత్స్యకారుడు ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. ఎంతో మంది నిరుపేద మత్స్యకారులు వలలు, బుట్టలు కొనుగులో చేయలేక జీవనోపాధి అయిన చేపల వేటకు దూరంగా ఉంటున్నారని ప్రభుత్వం కల్పించే ఈ సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్క మత్స్యకారుడు సబ్సిడీ క్రింద వచ్చే రుణాన్ని పొందేందుకు తమను సంప్రదించాలని అధ్యక్షులు వెంకట రమణ పేర్కొన్నారు. ఇలాంటి అవకాశం అప్పుడప్పుడు ప్రభుత్వం కల్పిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ఎంతో ఉపయోగం ఉంటుందని, ఇలాంటి పథకాల పట్ల అవగాహన లేకపోతే సబ్సిడీకి దూరమవుతారని పేర్కొన్నారు. అనంతరం మత్స్య సహకార శాఖ డీడి శాంతికి బద్వేలు మత్స్య సహకార సంఘం సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ నాగేంద్రరావు, కార్యదర్శి వెంకటయ్య, గౌరవ సలహాదారులు వజ్రాల వెంకటస్వామి, డైరెక్టర్లు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అయ్యన్నపాత్రుడి అరెస్టు అవివేకం

పులివెందుల రూరల్, నవంబరు 03, ప్రభాతవార్త :

మాజీమంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడును ఏపీ ప్రభుత్వ ఆదేశాల మేరకు సీఐడీ అరెస్టు చేయడం అవివేకం అని పులివెందుల నియోజకవర్గ టీడీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. పులివెందులలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకుడు రఘునాథరెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె వెంకటరామిరెడ్డి, లింగాల, సింహాద్రిపురం మండల అధ్యక్షులు విశ్వనాథరెడ్డి, జోగిరెడ్డి, తదితరులు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అయ్యన్నపాత్రుడిని అసాంఘికంగా అరెస్టు చేసి టీడీపీ నాయకుల్లో భయం పుట్టించే విధంగా అసంఘటిత చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోందన్నారు. ఇలా అక్రమ అరెస్టులు చేయడం దారుణం అన్నారు. గోడకూల్చిన విషయం సివిల్ పరిధిలోకి వస్తుందని, కానీ సీఐటీ అధికారులు అరెస్టు చేయడంలో ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు. తాటాకు చప్పుళ్లకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు భయపడే ప్రసక్తే లేదన్నారు. త్వరలో సీఎం జగనన్నకు, ఆయన ప్రభుత్వానికి ప్రజలు డైవర్స్ ఇచ్చే సమయం ఆసన్నమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో అసమర్థ ప్రభుత్వాన్ని ప్రజలు తరిమి కొడతారని మళ్లీ స్వర్ణాంధ్రప్రదేశ్ టీడీపీ సువర్ణ పాలన వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల మండల అధ్యక్షుడు పసాద్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి, తాలూకా క్లస్టర్ అధ్యక్షుడు జయభరత్‌రెడ్డి, టీడీపీ నాయకులు మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్న పాత్రుడిని అరెస్టు చేయడం అప్రజాస్వామికం

వేంపల్లె, నవంబరు 03, ప్రభాతవార్త :

మాజీమంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడిని పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికం అని టీడీపీ మండల కన్వీనరు రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టరు మహమ్మద్ షబ్బీర్‌లు అన్నారు. గురువారం వేంపల్లెలో వారు విలేకర్లతో మాట్లాడారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా అర్ధరాత్రి అయ్యన్నపాత్రుడుతో పాటు ఆయన కుమారుడు రాజేష్‌ను ఉగ్రవాదులుగా అరెస్టు చేయడం శోచనీయం అన్నారు. ఆయన దాదాపు 5సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా పనిచేశాడని తెలిపారు. అలాంటి వ్యక్తిని పోలీసులు అర్ధరాత్రి సమయంలో వీధిరౌడీల్లా ఇంటి లోపలికి ప్రవేశించి ఆయనను వీధిరౌడీని తీసుకువెళ్లినట్లు నెట్టుకుంటూ తీసుకువెళ్లడం దురదృష్టకరం అన్నారు. గతంలో చాలా మంది ఐఏఎస్‌లు జైలు పాలయ్యారన్నారు. ప్రస్తుతం కొంతమంది ఐపీఎస్‌లు వారి ప్రవర్తన మార్చుకోకపోతే వారికి కూడా జైలు జీవితం రుచి చూడాల్సి ఉంటుందన్నారు.సమావేశంలో టీడీపీ నాయకులు గోగుల మల్లికార్జున, పాపిరెడ్డి, పూల అల్లాబకాష్, మహమ్మద్ హఫీజ్ పసుపులేటి వీరభద్ర, యాసిన్, మహబూబ్ షరీఫ్, వెంకట శివ పాల్గొన్నారు.

పంట సాగు చేసిన రైతులు ఇ-క్రాప్ నమోదు చేసుకోవాలి

-జడ్పిటిసి వెంకటరమణ

రామాపురం.నవంబర్ 03 ప్రభాతవార్త

పంట సాగు చేసిన రైతులు ఇ-క్రాప్ నమోదు చేసుకోవాలని జడ్పిటిసి వెంకటరమణ, మండల వ్యవసాయ అధికారి నాగమణిలు అన్నారు. మండలంలోని నీలకంఠాపురం పేట నల్లగుట్టపల్లె కల్పనాయుని చెరువు హసనాపురం గ్రామ రైతుభరోసా కేంద్రాల్లో ఇ-క్రాఫ్ నమోదుపై గురువారం సామాజిక తనిఖీ గ్రామ సభలు నిర్వహించారు. ఈ రైతు భరోసా కేంద్రాలను ఆయన ముఖ్య అతిథులుగా హాజరయ్యి మాట్లాడారు. రైతు సాగుచేసిన పంటలకు ఇ-క్రాఫ్ చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ గ్రామ ఆర్టికల్ సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సిపి నాయకులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు అక్రమ అరెస్ట్‌ను ఖండించిన నాయకులు

రాయచోటి.నవంబర్ 03 ప్రభాతవార్త

రాష్ట్ర మాజీ మంత్రి బీసి నాయకులు అయ్యన్న పాత్రుడు అక్రమ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తూ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి టీటీడి పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు, నియోజకవర్గం తేదేపా యువనాయకుడు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వేరు వేరు ప్రకటనలలో గురువారం తీవ్రంగా ఖండించారు. 2 సెంట్లు స్థలం సాకు చూపి మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడును తెల్లవారుజామున దొంగలలా గోడలు దూకి పోలీస్‌లు అరెస్ట్ చేయడం అమానుషమని వారు మండిపడ్డారు. ఆ స్థల వివాదంపై కోర్టు స్టే ఉన్నప్పటికి అయ్యన్నను ఎలా అరెస్ట్ చేస్తారంటూ పోలీస్ శాఖను మీడియా ద్వారా వీరు ప్రశ్నించారు. అయ్యన్న పాత్రుడు కుమారుడుని మనవడు, మనవరాలును కూడా పోలీస్‌లు వేదించడంపై వారు మండిపడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇప్పటికే 24 మంది బీసి నేతలను హత్యచేశారని, 2650 మంది పై దాడులు, అక్రమ కేసులు పెట్టారన్నారు. ఉత్తరాంధ్ర ఆస్తులు, మైనింగ్ కబ్జాలుకు అడ్డుగా ఉన్నారని అయ్యన్న పాత్రుడు కుటుంబంపై జగన్‌రెడ్డి, అమ్రక దాడులు చేయించి వారిపై దుష్ప్రచారాలు చేస్తున్నారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతూ రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న జగన్‌రెడ్డికి గట్టుకాలం దగ్గర పడిందని రాష్ట్ర ప్రజలే తగిన బుద్ధి చెబుతారని వారు పేర్కొన్నారు.

గ్రాడ్యుయేట్ యువతీ, యువకులు ఓటు నమోదు చేసుకోండి

- అడా చైర్మెన్ గురుమోహన్

బ్రహ్మంగారి మఠం, నవంబరు 03 ప్రభాతవార్త :

2019 ఏడాది నాటికి (గ్రాడ్యుయేట్) డిగ్రీ పూర్తి చేసుకున్న యువతీ, యువకులు ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల కొరకు తమ విలువైన ఓటును నమోదు చేసుకోవాలని అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మెన్, మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు సింగసాని గురుమోహన్ పేర్కొన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయం నందు జడ్పీటీసి రామగోవిందరెడ్డి, ఎంపీపి వీరనారాయణ రెడ్డి, వివిధ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎయుడిఎ ఛైర్మెన్ గురుమోహన్ మాట్లాడుతూ వచ్చే నెల జరగనున్న ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల కొరకు డిగ్రీ పూర్తి చేసుకున్న గ్రాడ్యుయేట్లు తమ ఓటును నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవకాశం ఈ నెల 7వతేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం ఎంపీపి, జడ్పీటీసి మాట్లాడుతూ గ్రామాలలోని ప్రజా ప్రతినిధులు తమ పరిధిలోని గ్రాడ్యుయేట్లను సంప్రదించి 7వ తేదీ లోగా సద్వినియోగం చేసుకునే విధంగా వారికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత స్థానిక సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు ఉందన్నారు. గత ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల నాటికి మండల వ్యాప్తంగా 567 మంది గ్రాడ్యుయేట్లు ఉన్నారని, ఈ ఏడాది ప్రస్తుతం 436 మంది (40 మంది ఉపాధ్యాయులు మినహా) ఉన్నారని, దూర ప్రాంతాలలో ఉన్నవారు కాకుండా గ్రామాలలో ఉన్న వారికి ఓటు నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జగనన్న శాశ్వత భూహక్కు సర్వేను సమర్థవంతంగా నిర్వహించండి

పులివెందుల రూరల్, నవంబరు 03, ప్రభాతవార్త :

జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం రీసర్వేని సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్ అన్నారు. గురువారం పులివెందులలోని మున్సిపల్ కార్యాలయంలో వార్డు అడ్మిన్ సెక్రెటరీలు, వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ సెక్రెటరీలు, వార్డు రెవెన్యూ సెక్రెటరీలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్ మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి తీసుకోని సాహసోపేత నిర్ణయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్నారన్నారు. దాదాపు 100ఏళ్ల తరువాత జరుగుతున్న ఈ సర్వేని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కమీషనరు నరసింహారెడ్డి మాట్లాడుతూ ఎలాంటి వివాదాలకు తావు లేకుండా, ఎవరి ప్రలోభాలకు లొంగకుండా ఉద్యోగులందరు పనిచేయాలని తెలిపారు. టౌన్ ప్లానింగ్ అధికారి అయ్‌కుమార్ మాట్లాడుతూ ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్‌లో భాగంగా ఫారమ్ 16, 16ఏఏలను ఎలా తయారు చేసుకోవాలో శిక్షణ కు హాజరైన సెక్రెటరీలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజంపేట డివిజన్ ట్రాన్స్‌కో ఇఇగా చంద్రశేఖర్‌రెడ్డి

రాజంపేట అర్బన్, నవంబరు 3 ప్రభాతవార్త

రాజంపేట డివిజనల్ ట్రాన్స్‌కో ఆపరేషనల్ ఎక్జిక్యూటివ్ ఇంజనీరుగా చంద్రశేఖర్‌రెడ్డిని నియమిస్తూ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు చంద్రశేఖర్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను బదిలీ చేశారు. ఆయన స్థానంలో చంద్రశేఖర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన అనంతరం యునైడెట్ ఎలక్ట్రిసిటి ఎంప్లాయీస్ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు ఎరికల్‌రెడ్డి, కార్యదర్శి శ్రీహరి, యుఇఇసిడబ్ల్యుయు డివిజన్ అధ్యక్షులు డి.సుధాకర్, కార్యదర్శి పి.బాలక్రిష్ణ, గంగాధర్, కిరణ్, సురేంద్ర, సుబ్రమణ్యంలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఇఇకి పుష్పగుచ్చం అందజేశారు.

న్యాయసేవలపై అవగాహన సదస్సు

నందలూరు, నవంబరు 3 ప్రభాతవార్త

నందలూరు మండలంలోని స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు ఆవరణంలో మండల లీగల్ సర్వీస్ కమిటి ఛైర్మన్ కమ్ జూనియర్ సివిల్‌జడ్జి కె.లత ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులకు, పోలీసు అధికారులతో న్యాయ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారటి ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలోను ఇంటింటికి వెళ్లి ఉచిత న్యాయం అందరికి అందుబాటులో ఉంటుందని తెలియజేయాలన్నారు. అందుకోసం గ్రామ సచివాలయ వాలంటీర్లను, ఎన్‌జిఒలను, పోలీసువారిని, విద్యార్థులను భాగంగా చేసుకొని న్యాయ అవగాహన సదస్సును నిర్వహించాలని అన్నారు.ఈ నెల 12న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నందలూరు, పెనగలూరు, పుల్లంపేట మండలాల తహశిల్దారులు, ఎంపిడిఒలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బిసి సంక్షేమ సంఘం కమిటీల నియామకం

రాయచోటి టౌన్.నవంబర్ 03 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం జాతీయ బీసి సంక్షేమ సంఘం నూతన కమిటిని నియమించడం జరిగింది. ఈ సందర్భంగా బీసి సంఘం నియోజకవర్గ అధ్యక్షునిగా షేక్ జిలాని బాషను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అలాగే అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షునిగా మాధవరం శబరీష్, రాయచోటి నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా కుర్రపోతుల శివశంకర్ ఏకగ్రీవంగా నియమించడం జరిగింది ఈ మేరకు గురువారం పట్టణం లోని మదనపల్లె రోడ్డులో ఉన్న భానుహరి రెసిడెన్సీ నందు నూతన కమిటికి ని యామక పత్రాలను అన్నమయ్య జాతీయ బీసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పుల్లగూర రామాంజులు, గౌరవ అధ్యక్షులు గురిగింజకుంట శివప్రసాద్‌నాయుడు (గుట్టబాబు) చేతులు మీదుగా నియామక పత్రాలను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రామాంజులు, గుట్టబాబులు మాట్లాడుతూ బీసీలు సంక్షేమానికి తనవంతు కృషి చేస్తామన్నారు. బీసిలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం దిశగా తగు ప్రణాళికలు రూపొందించి ఆ దిశగా చర్యలు చేపడుతామని తెలిపారు. బీసి ఉప కులాలు అన్ని ఐకమత్యంతో మెలిగి హక్కుల సాధనకు తోడ్పడాలని వారు పిలుపునిచ్చారు.

7వ తేదీలోపు పట్టభద్రుల ఓటర్లు నమోదు చేసుకోవాలి

రామాపురం.నవంబర్ 03 ప్రభాతవార్త

మండలంలోని అర్హులైన పట్టభద్రులు ఈనెల 7వ తేదీలోపు ఆన్‌లైన్ చేసుకోవాలని తహశీల్దార్ సత్యానందం అన్నారు. గురువారం విఆర్‌వోలు, ఆర్‌ఐటీలతో పట్టభద్రుల ఓటర్ నమోదు విషయంపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019 లో డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రుల ఓటుకు ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. గుర్తింపు పొందిన సర్టిఫికేట్‌ల ఆధారాలతో ఈ దరఖాస్తులను చేసుకుని ఎంపిడీవో కార్యాలయం నందు సర్టిఫికేట్‌లను చూపించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ అరవింద్‌కిషోర్, ఆర్ఐలు రవిశంకర్, రెడ్డిబాబు, విఆర్‌వోలు పాల్గొన్నారు.

బాల సుబ్బయ్య మృతి టీడీపీకి తీరని లోటు

కడప కార్పొరేషన్, నవంబరు 3, ప్రభాతవార్త:

పుటిక వెంకట సుబ్బయ్య మృతి టీడీపీకి తీరని లోటని తెదేపా కడప పార్లమెంటు అభ్యర్థి రెడ్డప్ప గారి శ్రీనివాస రెడ్డి, టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి అమీర్‌బాబు, టీడీపీ రాష్ట్ర కార్యవర్గ కార్య దర్శి సింగారెడ్డి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని శివానందపురంలో పుటిక వెంకట సుబ్బయ్య వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పించారు. పుటిక డా.వెంకట రమణ, లాయర్ వెంకట సుబ్బయ్యలు ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమంలో బట్టలు పంపిణీ, అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుటిక బాల సుబ్బ య్య 1982 పార్టీ ఆవిర్భావం నుంచి తెదేపాకు పని చేశారని తెలిపారు. ఇతర పార్టీలకు చెందిన వారు ఎన్నో ప్రలోభాలకు గురి చేసినా లొంగకుండా పార్టీ కోసం కష్టపడ్డారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కడప పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి వికాస్ హరి, మీడియా కోఆర్డినేటర్ చెప్పలి జనార్ధన్, జలతోటి జయకుమార్, కొమ్మలపాటి సుబ్బరాయుడు, మాసాపేట శివ, ఆమూరి బాలదాసు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఓబనపల్లె కొత్తపల్లెకు తాగునీటి సమస్య పరిష్కారం

వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి

రైల్వేకోడూరు, నవంబరు 3 ప్రభాతవార్త

రైల్వేకోడూరు మండలంలోని ఓబనపల్లె కొత్తపల్లెలో ఇటీవల తాగునీటి సమస్యను వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి దృష్టికి తీసుకురాగా ఆయన గ్రామ సమస్యను దృష్టిలో ఉంచుకొని వేగవంతంగా నీటి సమస్య పరిష్కారానికి శ్రీకారం చుట్టడంతో ఓబనపల్లె కొత్తపల్లె గ్రామస్థులు గురువారం స్థానిక ఎంపిపి కార్యాలయంలో వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డిని పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ధ్వజారెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో వైసిపి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని అందుకు నిదర్శనమే వైస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన విధానమన్నారు. రానున్న రోజుల్లో ఓబనపల్లె, మరికొన్ని గ్రామాల్లో విద్యుత్తు మోటార్లను వేగవంతంగా బిగించి గ్రామీణ ప్రాంతాల్లో నీట సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, దూదేకుల సంఘం అధ్యక్షులు బాషా, రమణారెడ్డి, కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు నాయిని హరిక్రిష్ణారెడ్డి, దొమ్మరాజు సుబ్రమణ్యంరాజుతో పాటు వైసిపికి చెందిన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వైద్యులు డాక్టర్ థామస్ మృతి పట్ల పంతగాని సంతాపం

రైల్వేకోడూరు రూరల్, నవంబరు 3 ప్రభాతవార్త

రైల్వేకోడూరు నియోజకవర్గంలోని అత్యంత ముఖ్యమైన వైద్యుల్లో డాక్టర్ థామస్ అత్యంత ముఖ్యులని ఆయన మృతి బాధాకరమైన విషయమని రైల్వేకోడూరు తెలుగుదేశంపార్టీ నాయకులు, రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ థామస్ నివాసం నందు ఆయన భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తూ థామస్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు.కార్యక్రమంలో రైల్వేకోడూరు మాజీ సర్పంచ్, టిడిపి నాయకులు మలిశెట్టి మురళీధర్‌గౌడ్, రాష్ట్ర తెలుగు యువత నాయకులు బొక్కసం సునీల్, పాములపాటి ప్రసాద్‌నాయుడు, కూని చంద్రయ్య, దినేష్, సుబ్బరాయుడు, తెలుగుదేశానికి చెందిన ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

అయన్నపాత్రుని అరెస్ట్ దారుణం

రాష్ట్ర తెలుగుదేశంపార్టీ మాజీ మంత్రి చింతకాయల అయన్నపాత్రుడి అక్రమ అరెస్ట్ దారుణమని రైల్వేకోడూరు తెలుగుదేశంపార్టీ పంతగాని నరసింహప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం కక్ష్య కట్టుకొని అయన్నపాత్రుని వేధిస్తున్నదని ఇటువంటి కక్ష్యపూరిత పనులు మానుకోవాలని ఆయన హితవు పలికారు. రాష్ట్రంలో బిసి కులానికి చెందిన అయన్నపాత్రున్ని ఒక పథకం ప్రకారమే అరెస్ట్ చేశారని, మచ్చలేని బిసి నాయకుడు అయన్నపాత్రుడని వైసిపి నేతలు గుర్తించుకోవాలన్నారు. త్వలోనే వైసిపి ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడేరోజులు దగ్గరున్నాయని పంతగాని అన్నారు.

అయన్నపాత్రుని అక్రమ అరెస్ట్ అమానుషం

నందలూరు, నవంబరు 3 ప్రభాతవార్త

మాజీ మంత్రి చింతకాయల అయన్నపాత్రుడు అక్రమ అరెస్ట్ అమానుషమని నందలూరు టిడిపి మండల అధ్యక్షులు జంగంశెట్టి సుబ్బయ్య, మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి పసుపులేటి ప్రవీణ్‌లు అన్నారు. గురువారం ఆర్ అండ్‌బి బంగ్లా వద్ద నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయన్నపాత్రుడిని సిఐడి పోలీసులు అరెస్ట్ చట్టవిరుద్ధమని, మున్సిపల్‌శాఖకు సంబంధించి ప్రహారీగోడకు, సిఐడిలకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలపై జగన్ కక్ష్యసాధింపు చర్యలకు ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షుడు పల్లె సుబ్రమణ్యం, టిఎస్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటి సుబ్బరాయుడు, బిసిసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి భరతాల శ్రీధర్‌బాబు, నందలూరు సర్పంచ్ మోడపోతల రాము, ఎస్‌సిసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జ్యోతి శివ, మండల టిడిపి ఉపాధ్యక్షుడు చామంచి పెంచలయ్య, టిడిపి నాయకులు, పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నందలూరు, నవంబరు 3 ప్రభాతవార్త

నందలూరు కన్యకచెరువుపై కడప - రేణిగుంట హైవేమార్గంలో ఎన్.సుబ్రమణ్యం(37), తండ్రి చెంగయ్య అనేవ్యక్తి ఓబులవారిపల్లె మండలం శేషయ్యగారిపల్లెకు చెందినవాడు. ప్రధాన రహదారి దాటుతున్న సమయంలో కడపవైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోగా ఆ వ్యక్తి అక్కడిక్కడే మృతిచెందడం జరిగిందని ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అయ్యన్నపాత్రుడు అక్రమ అరెస్ట్ తగదు

- టీడీపీ కడప పార్లమెంటు అధికార ప్రతినిధి మునిరెడ్డి

అట్లూరు, నవంబరు 03 ప్రభాతవార్త :

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు చింతకాయల అయ్యన్నపాత్రుడుని అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ గ్రీవెన్ సెల్ మెంబర్, పార్లమెంటు అధికార ప్రతినిధి కొత్తపు మునిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ నాయకులను అక్రమ అరెస్ట్ చేయడం తగదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి టీడీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయడం చాలా దుర్మార్గం అన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ఏదైతే తప్పులు చేస్తున్నారో ఆ తప్పులను ప్రతిపక్ష నాయకుడిగా అయ్యన్నపాత్రుడు ఎత్తిచూపడంలో తప్పేముందన్నారు. వైసీపీ నాయకులు చేసే తప్పులు దుర్మార్గపు పనులను బయటపెడితే వారిపైన ఏదో ఒక అక్రమ కేసులు పెట్టడం, వారిని జైలుకు పంపడం ఎంత వరకు సమంజసం అన్నారు. టీడీపీ నాయకులపై అక్రమ అరెస్ట్‌లకు పాల్పడడం తాము పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. టీడీపీ నాయకులు అయ్యన్నపాత్రుడును వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం

-ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు కె.బయ్యారెడ్డి

సంబేపల్లె.నవంబర్ 03 ప్రభాతవార్త

సంపూర్ణ ఆరోగ్యానికి సమతల ఆహారం ఎంతో అవసరమని ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు, ఆధ్యాత్మిక వేత్త కె.బయ్యారెడ్డి అన్నారు. గురువారం సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమతుల ఆహారం - ఆరోగ్యం పై విద్యా ర్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం ప్రతి రోజు తీసుకునే ఆహారంలో పిండి పదార్థాలను ఇచ్చే బియ్యం, గోదుమలు, ప్రోటీన్‌ల కోసం పప్పులు, మాంసాహా రం వాటితో పాటు తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు వంటివి తప్పని సరిగా ఉండాలన్నారు. సమతుల ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండ వచ్చన్నారు. మార్కెట్‌లో దొరికే జం